ఆ చట్టాలే వారికి చుట్టాలు..!



- పెరుగుతున్న ఆర్థిక మోసాలు
- రిజిస్ట్రేషన్‌తో సరిపెడుతున్న అధికారులు
- ఆర్థిక మోసాలకు నిలయంగా సహకార శాఖ

మదనపల్లె, మార్చి 19: గృహ నిర్మాణ కో-ఆపరేటివ్ సొసైటీ ఆర్థిక మోసాలకు అడ్డాగా మారింది. కడప, రాయచోటి ప్రాంతాలకు చెందిన కొందరు వ్యక్తులు మదనపల్లె, పుంగనూరు, తదితర ప్రాంతాల్లో గృహనిర్మాణ సహకార సొసైటీలను ఏర్పాటు చేసి బినామీ పేర్లతో పాలకవర్గం సభ్యులను నియమించి తమ సొసైటీ ద్వారా హౌసింగ్ పేదలకు హౌసింగ్ రుణాలు ఇస్తూ వారిని మోసం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పేద, మధ్యతరగతి ప్రజలకు బ్యాంకులు రుణాలు ఇవ్వకపోవడంతో ఇలాంటి వారంతా తమ అవసరాల కోసం ప్రైవేటు సహకార సొసైటీలను ఆశ్రయిస్తూ మోసపోతున్నారు. రిజిస్ట్రేషన్, డీకేటీ ఇంటి పత్రాలను తమ పేరుతో తాకట్టు పెట్టుకుని రుణం మంజూరు చేస్తున్నారు. ఇందులో కొంత లబ్ధిదారునికి ఇస్తూ, మిగిలిన మొత్తం రెండో విడతలో ఇస్తామని కాలయాపన చేస్తూ తర్వాత బోర్డు తిప్పేయడం మామూలై పోయింది. ఆలస్యంగా బాధితులకు తెలిసినా కార్యాలయం ఎక్కడో, సభ్యులు ఎవరో, రికార్డులు ఎక్కడుంటాయో తెలియని పరిస్థితి. చివరకు సహకార శాఖాధికారు లను ఆశ్రయిస్తే వీరి ఆచూకీ దొరక్క విచారణ ముందుకు సాగదు. కొందరు అడ్రస్సులు దొరికినా రికార్డులు అందుబాటులో ఉండవు. విచారణ పేరుతో ఏళ్ల తరబడి కాలయాపన తప్ప బాధితులకు ఎలాంటి న్యాయం జరగడం లేదు.

ఆడిట్, అధికారుల విచారణ లేకపోవడంతో అక్రమార్కులకు బాగా కలిసొస్తోందని చెప్ప వచ్చు. తీరా చూస్తే తర్వాత హైదరాబాద్, విజయ వాడ నుంచి రికవరీ బృందం రుణాల జాబితా తీసుకుని ఇళ్లకు వెళ్లి కంతులు చెల్లించాలని డిమాండ్ చేస్తుంది. రుణం మంజూరైన దానికి, తమకు అందిన దానికి తేడా ఉంటుంది. అప్పుడు కాని మోసపోయా మని బాధితులకు తెలియదు. మంజూరైన రుణంలో ఇచ్చిందే సగం అయితే, తాము అప్పటికే చెల్లించిన వాయిదాలకు నకిలీ రసీదులు ఉంటున్నాయి. ఇలా జగతి, జీవనజ్యోతి, ఎడ్యుకేషన్ ఎంప్లాయిస్ కో-ఆప రేటివ్ తదితర హౌస్‌బిల్డింగ్ సొసైటీలు, ప్రముఖ వ్యక్తులు చీటీలు అయినా..వడ్డీలకు అప్పులైనా.. ఇలా.. పేరు ఏదైతేనేం తీరు మాత్రం ఒక్కటే. మోసపోయాక లబోదిబోమంటూ బాధితులు రోడ్డున పడుతున్నారు. కానీ వీటి నియంత్రణకు ప్రభుత్వాల్లో చలనం రాకపోగా, ఇటు ప్రజల్లో మార్పు కనిపించడం లేదు. భద్రత లేని, గుర్తింపులేని సంస్థల్లో పెట్టుబడులు పెట్టి తీవ్రంగా నష్ట పోతుండటంతో ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతు న్నాయి. చట్టంలోని లొసుగులను ఆసరాగా చేసుకున్న సంస్థలు ప్రజలను నట్టేట ముంచేస్తున్నాయి.

రాష్ట్ర స్థాయిలో సహకార శాఖ 1964 చట్టం ప్రకారం సంఘాలన్నీ ఆ శాఖ అధీనంలో ఉండేవి. డివి జన్ స్థాయిలో డీఎల్‌సీవో, జిల్లా స్థాయిలో డీసీవో రిజిస్ట్రేషన్ చేసిన త ర్వాత ఆడిట్, విచారణ, ఎన్నికల నిర్వహణ అంతా ఆ శాఖాధికారులే నిర్వ హించేవారు. అయితే ప్రభుత్వం ఈ చట్టాన్ని వికేంద్రీకరిస్తూ 1995లో మ్యాక్స్ యాక్టును ప్రవేశ పెట్టింది. 1964 యాక్టులోని అధికారుల అధికా రాలను మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ కమిటీలకు బదలాయిస్తూ 1995 యాక్టును తెచ్చింది. దీని కింద రిజిస్ట్రేషన్ అయిన సొసైటీలపై సహకార శాఖ అజమాయిషీ తగ్గి, ఆయా సంఘాల మేనేజ్‌మెంట్ కమిటీ లకు అగ్రస్థానం లభించింది. ఎన్నికలు కూడా రొటీన్ పద్ధతిలో మేనేజ్ మెంట్ కమిటీలే నిర్వహించుకుంటూ సంఘంలోని ఆర్థిక లావాదేవీలతో కూడిన ఆడిట్‌ను ప్రైవేటు చార్టెడ్ అకౌంటెంట్ చేత చేయిస్తూ మమ అని పిస్తున్నాయి. దీనిని ఆసరాగా చేసుకున్న కొందరు సొసైటీలను రిజిస్ట్రేషన్ చేసుకుని ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారు. మరోవైపు మైక్రోఫైనాన్స్ సంస్థలపై అప్పట్లో ప్రభుత్వం కొరడా ఝుళిపించడంతో కొందరు బడా నేతలు మ్యాక్స్ చట్టం కింద సొసైటీలను ఏర్పాటు చేసి ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించడం, తర్వాత కాల పరిమితి ముగిసిన బాండ్లకు సకా లంలో చెల్లింపులు చేయలేక బోర్డు తిప్పేసిన సందర్భాలూ ఉన్నాయి.

కొంప ముంచుతున్న 2002 యాక్టు..

సమాజంలో ప్రస్తుతం జరుగుతున్న ఆర్థిక మోసాల్లో ఎక్కువగా 2002 యాక్టు కింద రిజిస్ట్రేషన్ అయిన సంఘాల పరిధిలో జరుగుతున్నవే ఎక్కువగా ఉన్నాయి. అగ్రికల్చర్ అండ్ కో-ఆపరేటివ్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఆయా సంఘాలను రిజిస్ట్రేషన్ చేస్తోంది. దేశాన్ని యూనిట్‌గా తీసుకుని ఆయా రాష్ట్రాల్లో సొసై టీలను ఏర్పాటు చేస్తున్నారు. ఒక రాష్ట్రంలోని ప్రధాన పట్టణాన్ని కేంద్రంగా తీసుకుని ఇతర రాష్ట్రాల్లో బ్రాంచీలు ఏర్పాటు చేసి ప్రజల నుంచి డిపాజిట్లు సేకరిస్తున్నారు. ఢిల్లీ స్థాయిలో ఏర్పాటైన ఈ సంఘాలపై స్థానిక సహ కార అధికారులకు పర్యవేక్షణ, విచారణ బాధ్యత లేకపోవడంతో అవి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ఒకవేళ అధికారులు సంబంధిత కార్యాలయానికి వెళితే ప్రధాన కార్యాలయం కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్, తదితర ప్రాంతాల్లో ఉందని, చెబుతూ వాటికి సంబంధించి న పత్రాలు, వివరాలు ఇవ్వడానికి సిబ్బంది నిరాకరిస్తున్నారు. దీంతో అధికారులు నిస్సహాయస్థితిలో వెనుదిరిగి రావా ల్సి వస్తోంది. 1964 యాక్టు ప్రకారం ఏ రాష్ట్రానికి సంబంధించిన యాక్ట్ అమలులో ఉండగా, 2002 సహకార చట్టం దేశస్థాయిలో అమలవు తోంది. రాష్ట్రంలోని 1995 మ్యాక్స్ చట్టం, కేంద్రంలోని 2002 చట్టం ప్రకా రం అధికారులు సంఘాల రిజిస్ట్రేషన్‌కే పరిమితం అవుతున్నారు. ఆ తర్వాత వాటి పర్యవేక్షణ, సంఘాలపై విచారణ, ఎన్నికల నిర్వహణ బాధ్యతను తీసుకోకపోవడంతో సంస్థలు యథేచ్ఛగా ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నాయి. రాష్ట్రస్థాయిలోని మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ చట్టం (మ్యాక్స్), కేంద్రంలోని అగ్రికల్చర్, కో-ఆపరేటివ్ చట్టం కింద రాజ కీయ నాయకులు, ఆర్థిక, అంగబలమున్న నేతలతో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు ఈ ఆర్థిక సంస్థలను ఏర్పాటు చేసినట్లు ఆ శాఖాధికారులు చెబుతున్నారు. ఇలాంటి ఆర్థిక మోసాలను అరికట్టాలంటే. పార్లమెంటులో బిల్లు సహకార శాఖలో సంస్కరణలు చేపట్టాల్సి ఉందని నిపుణులు సూచిస్తున్నారు.



మదనపల్లెలో డివిజన్ స్థాయి సహకార శాఖ కార్యాలయం

ఎన్నికల నియమాలు కట్టుదిట్టంగా అమలు : కలెక్టర్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

రాయచోటి(కలెక్టరేట్), మార్చి 19: ఎన్నికల సంఘ మార్గదర్శకాలను అనుస రించి జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమాలను కట్టుదిట్టంగా అమలు చేస్తు న్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్‌కుమార్‌మీనాకు వివరించారు. మంగళవారం సాయంత్రం విజ యవాడ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఎన్నికల నియమాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌వో సత్యనారాయణరావు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొ న్నారు. ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల ప్రాంగణాల్లో, వాణిజ్య స్థలాల్లో ఎటు వంటి రాజకీయ ప్రకటనలు, హోర్డింగులు, పోస్టర్లు, బ్యానర్లను అనుమతించవ ద్దని రాష్ట్ర ప్రధాన ఎన్నిక అధికారి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రవ ర్తనా నియమావళి అమల్లో ఉన్నందున నూతన అనుమతులను ఏమాత్రం ఇవ్వరాదన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, కలె క్టర్ అధికారులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాలను దృష్టిలో ఉంచుకుని బోర్డర్ చెక్‌పోస్టుల్లో వెబ్ కాస్టింగ్ ద్వారా తగు పర్యవేక్షణ చేయాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్య టిస్తూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలుచేయడం, ఎలక్ట్రా నిక్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టంను విస్తృత స్థాయిలో వినియోగించాలని చెప్పారు. సీవిజిల్ ద్వారా అందే ఫిర్యాదులపై తక్షణం స్పందించి సకాలంలో పరిష్కరించాలని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల నోడల్ అధికా రులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు వలంటీర్ల సస్పెన్షన్

- వైసీపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం

పీలేరు, మార్చి 19: వైసీపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొని నిబంధనలు ఉల్లంఘించిన ఇద్దరు వలంటీర్లను సస్పెండ్ చేసినట్లు పీలేరు ఎంపీడీవో కె.ఉపేంద్ర రెడ్డి తెలిపారు. అధికార పార్టీ నేతల వెంట వలంటీర్లు ఎన్నికల ప్రచారం చేస్తున్న విషయం 'ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు' అన్న శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన విషయం పాఠకులకు విధి తమే. ఈ అంశంపై దృష్టి సారించిన ఎంపీడీవో, అగ్రహారం పంచాయతీకి చెంది వలంటీర్లు సాయి, సతీశ్, పీలేరు పట్టణానికి చెందిన వలంటీరు అజ్మత్ బాషా వ్యవహారంపై విచారణ జరిపారు. అగ్రహారం గ్రామంలో 18వ తేదీ రాత్రి జరిగిన అధికార పార్టీ నేతల ఎన్నికల ప్రచారంలో వారు పాల్గొన్నట్లు నిర్ధారణ కావడంతో వారిద్దరినీ సస్పెండ్ చేశారు. అయితే అజ్మత్‌బాషా భార్య ఆయేషా వలంటీరుగా ఉందని, ఆమె స్థానంలో అజ్మత్ విధులు నిర్వహిస్తున్నా డన్న విషయం తేలిందని, ఆ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులతో పాటు పీలేరు ఆర్‌వోకు నివేదించినట్లు ఎంపీడీవో తెలిపారు.

నేడు నారా భువనేశ్వరి రాక

- గాలివీడులో 'నిజం గెలవాలి' • బాధిత కుటుంబానికి పరామర్శ



రాయచోటి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును తట్టుకోలేక మృతి చెందిన కుటుంబాలను పరామర్శించడానికి ఆయన సతీమణి నారా భువనేశ్వరి బుధవారం రాయచోటి నియోజకవర్గా నికి రానున్నారు. మధ్యాహ్నం 12 గంట లకు ఆమె గాలివీడు మండలం ఎగువ గొట్టివీడు గ్రామం నాగన్నగుట్టపాలెం నగిరికి చెందిన మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ప్రభాకర్‌నాయుడు ఇంటికి రానున్నారు. ఆయన భార్య రెడ్డెమ్మ గత ఏడాది సెప్టెంబరులో జరిగిన చంద్రబాబు అక్రమ అరెస్టు వ్యవ హారాన్ని టీవీలలో చూస్తూ మనస్థాపానికి గురై గత ఏడాది అక్టోబరు 15వ తేదీ గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయాన్ని స్థానిక నాయకులు తెలు గుదేశం పార్టీ అధిష్టానానికి తెలియజేశారు. రాష్ట్రంలో చంద్రబాబు అక్రమ అరెస్టు సందర్భంగా చనిపోయిన వాని కుటుంబాలను నారా భువనేశ్వరి నిజం గెలవాలి.. అనే కార్యక్రమం పేరుతో పరామర్శిస్తున్నారు. ఇందులో భాగంగా ఆమె బుధవారం రెడ్డెమ్మ కుటుంబాన్ని పరామర్శించనున్నారు. ఈ సంద ర్భంగా ఇక్కడి ఏర్పాట్లను రాజంపేట పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం పర్యవేక్షించారు. అనంతరం అక్కడి నుంచి రాయ చోటి పట్టణం రాజుల కాలనీలో మృతి చెందిన రవీంద్రరాజు కుటుంబాన్ని మధ్యాహ్నం 2.30 గంటలకు పరామర్శించనున్నారు. రాజులకాలనీలో నివాసం ఉంటున్న వీరబల్లి మండలం కోనేటివాండ్లపల్లెకు చెందిన మాజీ సర్పంచ్ వెంక టరాజు కుమారుడు రవీంద్రరాజు చంద్రబాబు అక్రమ అరెస్టు విషయాన్ని టీవీలలో చూసి గుండెపోటుతో మృతి చెందాడు. ఇతడి కుటుంబాన్ని కూడా భువనేశ్వరి పరామర్శిస్తారు. రోడ్డు మార్గం ద్వారా ఆమె రానున్నారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చంద్రబాబు ఆదేశాలు పాటించకుంటే చర్యలు

- అసత్య ప్రచారాలు నమ్మకండి
- ఉమ్మడి అభ్యర్థి జయచంద్రారెడ్డే
- ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, చిత్రంలో టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, మార్చి 19: టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాలు పాటించకుంటే చర్యలు తప్పవని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. ములకలచెరువులోని పార్టీ కార్యాలయంలో మంగళవారం టీడీపీ అభ్యర్థి దాసరిపల్లి జయ చంద్రారెడ్డితో కలిసి ముఖ్య నాయకులు, కార్యక ర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవ ర్గంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అన్ని రకాల సర్వేలు నిర్వహించి టీడీపీ అభ్య ర్థిగా దాసరిపల్లి జయచంద్రారెడ్డిని బలపరిచా రని ఎమ్మెల్సీ తెలిపారు. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమాల్లో కొందరు పనిగట్టుకుని చేస్తున్న అసత్య ప్రచారాలు నమ్మవద్దన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి జయచంద్రారెడ్డేనని ఆన తెలిపారు. ఎట్టి పరిస్థితి ల్లోనూ అభ్యర్థి మార్పు ఉండదన్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ పథకాలైన సూపర్ సిక్స్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లుగా చేసిన అరాచకాలు, దౌర్జన్యాలు, భూకబ్జాలు, ఇసుక దోపిడీపై ప్రజల్లో విస్తృతంగా చర్చ జరిగేలా చూడాల న్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రత్యర్థులు ఎలాంటి ఆటంకాలు సృష్టించినా వెంటనే ఎన్ని కల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి దాస రిపల్లె జయచంద్రారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో తంబళ్లపల్లె నియోజకవర్గ గడ్డపై టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి జెండాలు ఎగరేసి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడికి బహుమతిగా ఇస్తామన్నారు. మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచే యాల్సిన సమయం వచ్చిం దన్నారు. టీడీపీ రాష్ట్ర కార్య దర్శి పర్వీన్‌తాజ్ మాట్లా డుతూ రాష్ట్రంలో అరాచక, అవినీతి పాలన సాగించిన వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నార న్నారు. సమావేశంలో జనసేన పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్, టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, వైజీ సురేం ద్రయాదవ్, రెడ్డెప్పరెడ్డి, టీడీపీ నేతలు కేవీ రమణ, చెన్నకేష్టా, యర్రగుడి సురేష్, నాయ కులు అంజనేయరెడ్డి, భజంత్రి రామాంజులు, రమణారెడ్డి, ప్రతాప్, సోము, ఫజరుల్లా, తంబళ్ల శివన్న పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా సుగవాసి ప్రసాద్‌బాబు



రాయచోటిటౌన్, మార్చి 19: టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు, రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు సుగవాసి ప్రసాద్‌బాబును తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమిస్తూ మంగళవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. తెలుగుదేశం పార్టీ బలోపేతానికి అహర్ని శలు శ్రమిస్తున్న సుగవాసి ప్రసాద్‌బాబు సేవలను గుర్తించి నియమించారు. ఈ సందర్భంగా సుగవాసి ప్రసాద్ బాబు మాట్లాడుతూ తనపై ఉన్న నమ్మకంతో రాష్ట్ర కార్యనిర్వాహక కార్య దర్శి పదవిలో నియమించినందుకు పార్టీ టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, జాతీయ కార్యదర్శి నారా లోకేశ్, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, రాజంపేట పార్లమెంట్, రాయచోటి నియోజకవర్గంతో పాటు జిల్లా స్థాయి, నియోజ కవర్గ స్థాయి నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో గ్రామ స్థాయి నుండి తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయడమే కాకుండా రాజంపేట పార్లమెంట్, రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్య ర్థుల విజయానికి తన వంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన అన్నారు.

కువైత్‌లో ఉన్న జిల్లా వాసులకు తీపి కబురు


కువైత్ దేశం

- క్షమాభిక్ష ప్రకటించిన కువైత్ ప్రభుత్వం
- అనధికారికంగా అక్కడ ఉన్న వారికి ఊరట

రాజంపేట, మార్చి 19: కువైత్ దేశంలో అనధికారికంగా ఎన్నో సంవత్సరాలుగా అక్కడే ఉంటూ ఇబ్బందులు పడు తున్న జిల్లా ప్రవాసులకు ఎంతో ఊరట లభించింది. కువైత్ లో అనేక పనులు చేసుకుంటూ అన్నమయ్య జిల్లా నుంచే లక్ష మందికి పైబడి ఆ దేశంలో జీవిస్తున్నారు. అనేక ట్రావెల్ ఏజెంట్ల ద్వారా తప్పుడు వీసాలతో అక్కడికి వెళ్లి ఆ దేశంలో అధికారికంగా తిరగడానికి వీలు లేక దొంగచాటుగా ఉంటూ అనధికారిక లెక్కల ప్రకారం సుమారు 5 వేల మందికి పైబడి అక్కడ జీవనం సాగిస్తూ ఇబ్బందులు పడు తున్నారు. వీరందరికీ కువైత్ ప్రభుత్వం రంజాన్ నెల సంద ర్భంగా ఈనెల 17వ తేదీ క్షమాభిక్ష ప్రకటించింది. ఈ క్షమా భిక్షకు దరఖాస్తు చేసుకోవడానికి జూన్ 17వ తేదీ మూడు నెలల గడువు ఇచ్చారు. దీని ప్రకారం ఆ దేశంలో అక్ర మంగా ఉంటున్న వారు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా దేశం విడిచి వెళ్లడానికి, ఒకవేళ అక్కడే ఉండాల నుకుంటే అపరాధ రుసుం చెల్లించి ఉండటానికి చట్టబద్ధత కల్పించుకునేందుకు అనుమతినిచ్చింది. దీంతో బాధితుల కుటుంబీకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆ దేశ అంచ నాల ప్రకారం 1.30 లక్షల మంది ఆ దేశంలో అక్రమంగా నివాసం ఉండగా అందులో అన్నమయ్య జిల్లా వాసులు 5 వేల మంది ఉన్నట్లు తెలుస్తోంది. ఆ దేశంలో 2020 ఏప్రి ల్‌లో కూడా ఇదే విధంగా క్షమాభిక్ష పెట్టి అనధికారికంగా ఉన్న వారికి ఈ సౌలభ్యాన్ని కల్పించారు. అన్నమయ్య జిల్లా లోని రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి ప్రాంతాల నుంచి లక్ష మందికి పైబడి కువైత్‌కు వెళ్లి వివిధ వృత్తుల్లో జీవనం సాగిస్తున్నారు. ఇంటి పని, వంట పని, గృహ నిర్మాణ కార్మికుల పని, భవన నిర్మాణ కార్మికుల పని, రోడ్డు నిర్మాణ, గొర్రెల కాపరులుగా, డ్రైవర్లుగా ఇతరత్రా అనేక పనులు చేసుకుంటూ అక్కడ ఉన్నారు. ఇదిలా ఉండగా అ నేక మంది బ్రోకర్లు, ట్రావెల్ ఏజెంట్లు, కువైత్ దేశంలోని కొంతమంది మోసగాళ్లు కలిసి తప్పుడు వీసాలు సృష్టించి అమాయకుల వద్ద వేలాది రూపాయలు గుంజి ఆ దేశానికి పిలిపించుకున్నారు. ప్రధానంగా మహిళలు, అక్షర జ్ఞానం లేని వారు, గ్రామీణులు ఈ మోసపూరిత వీసాలతో అక్క డికి వెళ్లాక మోసాలను పసిగట్టి ఇంటికి రాలేక, అక్కడ ఉండలేక ఎడారుల్లోనూ, దొంగచాటుగా ఇతరుల శిబిరాల్లో ఉంటూ అనధికారికంగా కూలీనాలీ చేసుకుంటూ అక్కడే ఉంటున్నారు. ఇంటికి రాలేక అక్కడ ఉండలేక రాత్రింబవళ్లు కష్టపడుతూ అప్పులు తీర్చుకోవడానికి అనేక కష్టాలు పడుతూ కన్నీటిపర్యంతమవుతూ ఇబ్బందులు పడుతు న్నారు. వీరందరికీ రంజాన్ నెల సందర్భంగా కువైత్ ప్రభుత్వం క్షమాభిక్ష పెట్టడంతో అక్కడ అనధికారికంగా ఉన్న ప్రవాసాంధ్రులకు ఊరట లభించింది.

కువైత్‌లో ఉన్న 5 వేల జిల్లా వాసులకు ఊరట

- షేక్ మస్తాన్, కువైత్, నగిరిపాడు వాసి

కువైత్ ప్రభుత్వం పెట్టిన క్షమాభిక్ష వల్ల అనధికారికంగా అక్కడుంటున్న మనవారికి ఎంతో ఊరట లభించింది. కువైత్‌లో తప్పుడు వీసాలతో వచ్చిన సుమారు 5 వేల మందికి ఈ ఇబ్బందులు తీరిపోయాయి. వారికి అక్కడ పనులు ఉన్నట్లు, ఏదో కంపెనీలో ఉద్యోగం లభించినట్లు తప్పుడు వీసాలు తీసి కొంతమంది ట్రావెల్ ఏజెంట్లు మోసం చేశారు. అటువంటి వారు కువైత్‌లో పనులు దొరక్క ఎడారిలో దొంగచాటులో గొర్రెలు మేపుకోవడం, ఇతరత్రా గుట్టుచప్పుడు కాకుండా ఇతరత్రా పనులు చేసు కుంటూ అక్కడ జీవనం సాగిస్తున్నారు. ఇటువంటి వారికి ఇంటికి పోవాలన్నా, అక్కడ ఉండాలన్నా కువైత్ ప్రభుత్వం వారికి క్షమాభిక్ష ప్రకటించడంతో ఇబ్బందులు తొలగిపోయాయి.

సమాజంలో ఎన్జీవోల పాత్ర కీలకం

సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్



మాట్లాడుతున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్

కడప(రూరల్) మార్చి 19 : సమాజంలో ఎన్జీవోల పాత్ర కీలకమని, ఈ మేరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా ఎన్జీవోలు అవగాహన కల్పించాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్ తెలిపారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణంలోని న్యాయసేవా సదన్‌లో ఎన్జీవోలకు సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఎన్జీవోలు అన్ని వర్గాలకు అవేర్‌నెస్ కలిగించి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం గురించి వివరించారు. ఉచిత న్యాయసహాయం, లోకాయుక్త గురించి తెలియపరిచారు. ఎన్జీవోల యాక్టివిటీస్ గురించి అడిగి తెలుసుకున్నారు.

కడపలో భూకబ్జాలకు అడ్డే లేదు

పేట్రేగిపోతున్న వైసీపీ నాయకులు : అఖిలపక్ష నేతల వెల్లడి



వెంచర్లను పరిశీలిస్తున్న అఖిలపక్ష నేతలు

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 19 : ఐదేళ్ల కాలంలో కడప నగరం చుట్టుపక్కల ప్రాంతాల్లో భూమాఫియా పేట్రేగిపోయిందని అఖిల పక్ష నాయకులు మండిపడ్డారు. నగర సరిహద్దు ప్రాంతమైన సీకేదిన్నె మండల ప్రాంతంలో సర్వే నెం.253/2లో ఉన్న దాదాపు 42.75 ఎకరాల భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా అఖిల పక్ష ఐక్యవేదిక కన్వీనర్ కారు ఆంజనేయులు మాట్లాడుతూ కడపలో ఉన్న భూకబ్జాలకు అడ్డూఅదుపు లేకుండాపోయిందన్నారు. ప్రభుత్వ భూమి ఎక్కడ ఖాళీగా కనపడితే అక్కడ గద్దల్లాగా వాలిపోయి ఆక్రమించుకుంటున్నారన్నారు. ఇది ఒక పెద్ద ముఠాలా తయారైందని, డిప్యూటీ మేయర్ అండదండలతోనే ఈ కబ్జా జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. త్వరలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి భూకబ్జాలకు వ్యతిరేకంగా ఆందోళనా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అఖిల పక్ష రాజకీయ ప్రజా సంఘాల నాయకులు చేతివృత్తుల జాతీయ కన్వీనరు అవ్వారు మల్లికార్జున, రైతు స్వరాజ్య వేదిక పుత్తా శివారెడ్డి, దళిత మిత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కైపు రామాంజనేయులు, లోక్‌సత్తా పార్టీ జిల్లా కన్వీనరు దేవరక్రిష్ణ, హేతువాద సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సీఆర్వీ ప్రసాద్, విద్యార్థి యువజన నాయకుడు డీఎం ఓబులేసు, గ్రేటర్ రాయలసీమ అభివృద్ధి వేదిక జిల్లా కన్వీనర్ బందెల ఓబయ్య, నగర కన్వీనర్ షాజహాన్, కో-కన్వీనర్ ఆలీబాబా పాల్గొన్నారు.

400 లీటర్ల సారా ఊట ధ్వంసం

సుండుపల్లె, మార్చి19: మండలంలోని భాగంపల్లె గ్రామ పంచాయతీ కుప్పగుట్ట గ్రామ పరిధిలో 400 లీటర్లసారాయి ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ ఎస్‌కేఎం హుస్సేన్ మంగళ వారం తెలిపారు. సారాయి బట్టీలను ఏర్పాటు చేస్తే సహించేది లేదని, అలా చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మత్తు పానీయాలు మానవ జీవితాన్ని నాశనం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బీడీ నాయక్, కానిస్టేబుల్ టీవీఎస్ రాజు, మోహన్, పోలీసు సిబ్బంది, హోంగార్డులు పాల్గొన్నారు.

భార్య హత్య కేసులో భర్తకు రిమాండ్



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

లక్కిరెడ్డిపల్లె మార్చి 19: భార్యను హత్య చేసిన కేసులో భర్తను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ జీవన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కుర్నూతల పంచాయతీ బమ్మేపల్లె గ్రామానికి చెందిన రమణమ్మ ప్రవర్తన సరిగా లేకపోవడంతో తానే ఆమెను హత్య చేసినట్లు నిందితుడు యోగానందరెడ్డి ఒప్పుకున్నట్లు సీఐ వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ విష్ణువర్ధన్‌రెడ్డి హెడ్ కానిస్టేబుల్ రామ్‌ప్రసాదు సిబ్బంది పాల్గొన్నారు

బ్రహ్మోత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు



ఒంటిమిట్ట, మార్చి 19 : కోదండరాముడి బ్రహ్మోత్సవాలకు టీటీడీ ఆధ్వర్యంలో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఏప్రిల్ 16 నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాల నేపథ్యంలో టీటీడీ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేపట్టారు. కోదండరామాలయ ప్రాంగణంలో రహదారులు, మాడవీధులను పెయింటింగ్ కార్యక్రమాలను చురుగ్గా చేపట్టారు. మాడవీధుల్లో చలువపందిళ్లు, భక్తులకు ఏర్పాటు చేసి అన్నదానం, శానిటరీ వంటి వాటిపై ముందస్తుగా చర్యలు చేపట్టారు. కల్యాణ వేదిక ప్రాంతంలో నూతన మరుగుదొడ్లు ఏర్పాటు చేయడం, తాగునీటి కోసం ప్రత్యేక ఫ్లైఓవర్ ట్యాంక్, కల్యాణ వేదిక ప్రాంతమంతా భక్తుల కోసం ప్రత్యేకంగా బండలు ఏర్పాటు చేశారు. వీటితో పాటు గ్రీనరీ రోడ్లు వంటి వాటిని ముమ్మరంగా చేపట్టారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను టీటీడీ అధికారులు చేపట్టారు.

ప్రమాద రహిత డ్రైవర్లుగా మన్ననలు పొందాలి

శిక్షణా తరగతులలో ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి

కడప (మారుతీనగర్), మార్చి 19: ప్రమాద రహిత డ్రైవర్లుగా ఆర్టీసీలో సేవలందించి అధికారుల మన్ననలు అందుకోవాలని ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పొలిమేర గోపాల్‌రెడ్డి డ్రైవర్లకు సూచించారు. మంగళవారం స్థానిక ఆర్ఎం కార్యాలయ సమావేశ మందిరంలో యాక్సిడెంట్స్, డ్రంకన్, ర్యాష్ డ్రైవింగ్ చేసిన వారికి ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బస్సు నడిపే సమయంలో డ్రైవర్ మానసిక ఒత్తిడితో ఉండరాదన్నారు. అనంతరం ఆర్టీసీ డిప్యూటీ సీఎంఈ లక్ష్మిభాస్కర్ మాట్లాడుతూ పంచ సూత్రాలు పాటించి డ్రైవింగ్ చేయడం వల్ల ఇంధనాన్ని పొదుపు చేయడంతో పాటు ప్రమాదాలను నివారించగలమన్నారు.

ఎల్ఎల్‌బీ పరీక్షల తేదీల్లో మార్పు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 19: వైవీయూ పరిధిలో ఈనెల 23న జరగాల్సిన 3, 5 ఏళ్ల లా పరీక్షలను 24వ తేదీకి వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. కొన్ని సాంకేతిక కారణాల దృష్ట్యా ఈ మార్పు చేశామని విద్యార్థులు గమనించాలన్నారు. మిగలిన పరీక్షలు యథావిధంగా జరుగుతాయన్నారు.

గాలివీడులో బీళ్లుగా ఉన్న భూములు



నీరు లేక ఎండిపోయిన నూలివీడు పంచాయతీ నక్కలవాడపల్లెలోని మెరగల చెరువు



రైతుల ఆశలు ఆవిరి

- రైతులను నట్టేట ముంచిన ఖరీఫ్, రబీ సీజన్‌లు
- ఎడారిగా మారిన వ్యవసాయ భూములు
- రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా లక్ష ఎకరాల్లో పంటల సాగు ప్రశ్నార్థకం

గాలివీడు, మార్చి 19: ఒకప్పుడు పంట పొలాలతో కళకళలాడే భూములు నేడు వర్షాలు లేక ఎడారిని తలపిస్తున్నాయి. ఖరీఫ్‌పై ఎంతో ఆశలు పెట్టుకున్న రైతుల ఆశలు ఆడియాశలు కాగా రబీలో కూడా వరుణదేవుడు కరుణించకుండా ముఖం చాటేశాడు. దీంతో రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా లక్ష ఎకరాలకు పైబడి సాగు భూమి బీడువారి ఎడారిని తలపిస్తోంది. చేసేదేమీ లేక రైతులు పొట్టకూటి కోసం పట్టణాలకు తరలివెళ్లే పరిస్థితులు నెలకొంటున్నాయి. రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా కరువు ఛాయలు అలుముకున్నాయి. నియోజకవర్గంలోని మొత్తం జనాభాలో మూడొంతుల మంది వ్యవసాయం దాని అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ ప్రాంతంలో వరి, వేరుశనగతో పాటు కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్నారు. ఈ ప్రాంత భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా వేరుశనగ సాగుకు అనుకూలమైన భూములు, వాతావరణ పరిస్థితులు ఉన్నాయని, చెరువు, బావుల కింద వరిని సాగు భూమితో పాటు ఇటీవల బోరుబావుల కింద కాయకూరలు, ఆకుకూరలను సాగు చేస్తున్నారు. వీటితో పాటు పండ్ల తోటల్లో ఒకటైన మామిడిని విస్తృతంగా పెంచుతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 50 వేల ఎకరాలకు పైబడి వేరుశనగ, 30 వేల ఎకరాలకు పైబడి వరి, 10 వేల ఎకరాలకు పైబడి మామిడి, మిగతా భూమిలో ఇతర పంటలను సాగు చేస్తున్నారు.

నిరాశపరచిన రుతుపవనాలు

సాధారణంగా జూన్‌లో ప్రారంభమయ్యే నైరుతి రుతుపవనాలు (ఖరీఫ్ సీజన్) కాలంలో వర్షాలు సక్రమంగా కురిస్తే అధిక విస్తీర్ణంలో వేరుశనగను సాగు చేసేవారు. కానీ ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు పడకపోవడం వలన వేరుశనగ సాగు గణనీయంగా తగ్గిపోయింది. కనీసం 10 వేల ఎకరాలు కూడా సక్రమంగా వేరుశనగను సాగు చేసిన దాఖలాలు కనపడలేదు. అదే గత సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో 40 వేల ఎకరాలకు పైబడి వేరుశనగను సాగు చేసేవారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి నామమాత్రంగా కూడా సాగు చేయకపోవడం గమనార్హం. కనీసం ఈశాన్య రుతుపవన కాలంలోనైనా (రబీ సీజన్) తుఫానుల ప్రభావంతో అధిక వర్షాలు కురుస్తాయి. అనుకుంటే వరుణదేవుడు కరుణించలేదు. సాధారణంగా ప్రతి ఏడాది అక్టోబరు, నవంబరు నెలల్లో బంగాళాఖాతంలో ఏర్పడే తుఫానుల వల్ల రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసేవి. కానీ ఈ ఏడాది కనీసం ఒక్క తుఫాను ప్రభావం కూడా ఈ ప్రాంతం మీద పడలేదు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ సీజన్‌లో మాత్రమే ఈ ప్రాంతంలో వరిని ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసేవారు. కానీ నేడు రబీ సీజన్‌లో వరి కనుమరుగైంది. ఖరీఫ్, రబీ రెండు సీజన్లలో వరుణదేవుడు కరుణించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కనీసం తిండి గింజలు పండించుకోవడానికైనా వర్షం కురవలేదని ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే జీవనం ఎలా సాగించాలని రైతులు ఆందోళన చెందుతున్నారు. 30 సంవత్సరాల కాలంలో అక్టోబరు, నవంబరు నెలల్లో తుఫానులు లేకపోవడం గతేడాదేనని ఇలాంటి సంవత్సరాన్ని ఎన్నడూ చూడలేదని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే అందరూ ప్రజలను పల్లెలను వదిలి పట్టణాలకు పోవాల్సిన పరిస్థితులు ఏర్పడతాయి. తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా ఇప్పుడే ఇలాంటి దుర్భర పరిస్థితులు ఉంటే ఇక అధికంగా ఎండలు ఉండే ఏప్రిల్, మే నెలల్లో ఎలాంటి పరిస్థితులు ఉంటాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఎండాకాలం మామిడి చెట్లను కాపాడుకోవడం తలకు మించిన భారం అవుతుందని రైతులు వాపోతున్నారు.

30 సంవత్సరాలుగా ఇలాంటి పరిస్థితులు చూడలేదు..



నా వయస్సు 60 సంవత్సరాలు. నాకు తెలిసినంత వరకు గత 30 సంవత్సరాలుగా రబీ సీజన్‌లో ఇలాంటి తీవ్ర వర్షాభావ పరిస్థితులు చూడలేదు. ప్రతి సంవత్సరం అక్టోబరు, నవంబరు నెలల్లో కనీసం సగం చెరువులు నిండేవి. గత ఏడాది నెలకు ఒక పదును కూడా సక్రమంగా కాలేదు. ఇదే పరిస్థితి కొనసాగితే పల్లె సీమలు అన్ని ఖాళీ అయిపోయే పరిస్థితులు నెలకొంటాయి.

-పెద్దు రెడ్డెప్పరెడ్డి, నూలివీడు, రైతు

గణనీయంగా తగ్గిన పంటల సాగు..



మాకు 15 ఎకరాలు మెట్ట, మాగాణి కలదు. ప్రతి సంవత్సరం ఖరీఫ్‌లో మెట్ట భూమిలో వేరుశనగ, రబీ సీజన్‌లో మాగాణిలో వరి సాగు చేసే వాళ్లము. కానీ ఈ ఏడాది 3 ఎకరాల్లో వేరుశనగను కూడా సాగు చేయలేకపోయాము. వరిని సాగు చేయాలన్న ఆలోచన కూడా లేదు. ఎందుకంటే వర్షాలు లేకపోవడమే.

- ఈశ్వర్‌రెడ్డి, రైతు, సీసీపల్లె

మామిడి తోటలను కాపాడుకోవడం కష్టమే..



ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. చెరువుల్లో, బావుల్లో ఇప్పటికే చుక్కనీరు లేకుండాపోయింది. బోరు బావులు కూడా ఏప్రిల్, మే నెలల్లో ఎండిపోయే పరిస్థితులు ఉన్నాయి. బోరుబావులు అడుగంటిపోతే మామిడి చెట్లు వాడిపోతాయి. కొన్ని సంవత్సరాలుగా సాకిన చెట్లు కళ్ల ముందే ఎండిపోతే ఆ బాధను భరించలేదు.

- పిచ్చయ్య, పూలుకుంట

పంప్‌హౌస్‌ల వద్ద ఎక్స్‌కవేటర్‌తో మట్టి తొలగింపు





ఎక్స్‌కవేటర్‌తో పంప్‌హౌస్ వద్ద పనులు చేస్తున్న దృశ్యం, ఎమర్జెన్సీ రంధ్రం ద్వారా పంప్‌హౌస్‌లలోకి నీరు ఎక్కిస్తున్న దృశ్యం

- ఎమర్జెన్సీ ఉపయోగించిన పంప్‌హౌస్ సిబ్బంది

జమ్మలమడుగు, మార్చి 19: జమ్మలమడుగు నియోజకవర్గంలోని మైలవరం జలాశయంలో మంచినీరు అందించే పంప్‌హౌస్‌ల వద్ద సోమవారం రాత్రి వరకు మట్టిని తొలగించి పనులు చేసినట్లు తెలుస్తోంది. మైలవరం పంప్‌హౌస్‌ల వద్ద మైలవరం, పెద్దముడియం మండలాలకు తరలించే పంప్‌హౌస్ వద్ద ఎమర్జెన్సీ రంధ్రాలను ఉపయోగించేందుకు అడ్డంగా ఉన్న రాళ్లను, మట్టిని తొలగించేందుకు ఇప్పటికే అధికారులు ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. అలాగే జమ్మలమడుగు మున్సిపాలిటీ అందించే పంప్‌హౌస్ వద్ద ఇదే రకంగా ఆదేశాలిచ్చినట్లుగా సమాచారం. అయితే ప్రొద్దుటూరు, కడప కార్పొరేషన్‌కు నీరు అందించే పంప్‌హౌస్ వద్ద మెగా కన్‌స్ట్రక్షన్‌కు చెందిన కాంట్రాక్టర్లు ఎక్స్‌కవేటర్ ద్వారా జలాశయంలో నుంచి అడ్డంగా ఉన్న మట్టిని, రాళ్లను తొలగించారు. పంప్‌హౌస్ పక్కనే ఎమర్జెన్సీ రంధ్రం ద్వారా పై పట్టణాలకు నీరు అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. అయితే గండికోట జలాశయం నుంచి మంగళవారం ఉదయానికి కొంతవరకు నీరు విడుదల కావడంతో తాగునీటిని వారం రోజుల పాటు పంప్‌హౌస్‌లోకి మోటార్ల ద్వారా లాగేందుకు ఇబ్బంది ఉండదని తెలిసింది. గండికోట జలాశయం నుంచి అధికారులు 0.3 టీఎంసీలు వచ్చే వరకు రోజుకు 350 నుంచి 500 క్యూసెక్కుల వరకు మైలవరం జలాశయానికి నీటిని విడుదల చేసినట్లు ఇరిగేషన్ శాఖ ఏఈ గౌతమ్‌రెడ్డి తెలిపారు.

ప్రభుత్వ భూమిలో కబ్జాదారుల పాగా



ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన అక్రమ కట్టడాలను పరిశీలిస్తున్న వీఆర్వో

సిద్దవటం, మార్చి 19 : సిద్దవటం మండలం పెద్దపల్లె రెవెన్యూ బొగ్గిడివారిపల్లె సర్వే నెంబరు 870లోని ప్రభుత్వ భూమిలో కొంతమంది ఎటువంటి అనుమతి లేకుండా రెండు రోజులుగా రాత్రి వేళలో నిర్మాణాలు చేస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. కడప-చెన్నై నేషనల్ హైవే ప్రాంతం ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని రాజకీయ పలుకుబడి, అధికారుల అండదండలతో అక్రమ కట్టడాలు కొనసాగిస్తున్నారని పేద ప్రజలకు రెండు సెంట్లు ఇంటి స్థలం మంజూరు చేయాలన్నా నెలలు తరబడి కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని ఎందుకు చర్యలు చేపట్టడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి అక్రమ గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనపరుచుకొని అర్హత గల పేదవారికి ఇవ్వాలని తెలియజేశారు. ఈ విషయంపై స్థానిక వీఆర్వో రేణుకను వివరణ కోరగా 870 సర్వే నెంబరుపై ఫిర్యాదు వచ్చిందని వెంటనే అక్కడికి వెళ్లి ఆ స్థలాన్ని పరిశీలించామని ఆ విషయాన్ని తహశీల్దారు దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అక్రమ కట్టడందారులు సంబంధిత పత్రాలు తీసుకొని రావాలని తెలిపారు.

యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన!

- సచివాలయం వాట్సాప్ గ్రూపులో వైసీపీ ప్రచారాల జోరు
- పట్టించుకోని ఎన్నికల అధికారులు



సచివాలయం వాట్సప్ గ్రూపులో వైసీపీ ప్రచారం

రైల్వేకోడూరు(రూరల్) మార్చి 19: ఎన్నికల అధికారులు ఎన్నిసార్లు హెచ్చరికలు జారీ చేసినా సచివాలయం సిబ్బంది, వలంటీర్ల తీరు మారడం లేదు. గురుభక్తి కోసం ఏకంగా సామాజిక మాధ్యమాల్లో ఎన్నికల ప్రచారానికి తెరలేపారు. అధికారుల హెచ్చరికలు కూడా బేఖాతరు చేస్తున్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ఏర్పడిన వలంటీర్ల వ్యవస్థ వైసీపీ నాయకులకు ప్రచారాల వ్యవస్థగా మారింది. ఎన్నికల విధులకు వలంటీర్లు దూరంగా ఉండాలని ఎన్నికల అధికారులు తీవ్ర హెచ్చరికలు జారీ చేసినా కోడూరులో ఆ పరిస్థితి కనబడడం లేదు. సచివాలయంలో ప్రతి వలంటీరు లబ్ధిదారులకు సేవలు అందించడం కోసం వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేసుకున్నారు అందులో భాగస్వాములుగా సచివాలయం సిబ్బంది ఉన్నారు. ఎన్నికల కోడ్ అమలు కావడంతో ప్రభుత్వం ఇచ్చిన సిమ్ కార్డులు, ఫోన్‌లో ఉండే డేటా వాట్సాప్ గ్రూపులు అన్నీ పూర్తి స్థాయిలో తొలగించి ఎన్నికల అధికారులకు అప్పచెప్పాలి. కానీ కోడూరులో ఇప్పటివరకు అధికారులు సచివాలయం సిబ్బంది వద్ద కానీ వలంటీర్ల వద్ద కానీ సిమ్‌కార్డులు తీసుకున్న దాఖలాలు లేవు. ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ ప్రతిరోజూ కోడూరు సచివాలయం-4 లో వైసీపీ ప్రచారాలు జోరు కొనసాగుతోంది. గ్రూపులో ఉన్న అధికారులు తమకు ఏమీ తెలియనట్లు వ్యవహరించడం గమనార్హం. ఈ సంఘటనపై రైల్వేకోడూరు తహసీల్దార్‌ను వివరణ కోరగా సామాజిక మాధ్యమాల్లో వైసీపీకి అనుకూలంగా ప్రచారాలు నిర్వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాజకీయ పార్టీల నాయకులు కోరుతున్నారు.

గండికోట నుంచి మైలవరానికి నీరు విడుదల

కొండాపురం, మార్చి 19 : గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి 500 క్యూసెక్కుల నీరు వదులుతున్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. కడప పట్టణంలో నీటిఎద్దడి ఉన్నందున ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గండికోట నుంచి మైలవరానికి 0.3 టీఎంసీల నీటిని విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 5.1 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డీఈ తెలిపారు.

అన్నదమ్ముల ఘర్షణ

రామాపురం, మార్చి 19: పంపుసెట్టు వంతుల విషయంలో మండలంలోని చిట్లూరు మజ్జిగవాండ్లపల్లెకు చెందిన రామచంద్రారెడ్డి, అమర్‌నాథరెడ్డి వారి కుమారులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఘర్షణ పడ్డారు. ఘర్షణలో నలుగురికి తీవ్రగాయాలు కాగా, ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఏఎస్ఐ శ్రీనివాస్‌శర్మ తెలిపారు.

యువకుడిపై కత్తితో దాడి

కడప (క్రైం), మార్చి 19 : కడప నగరం అల్మాస్‌పేట వద్ద సోమవారం రాత్రి ఓ యువకుడిపై ఐదుగురు కత్తితో దాడిచేసి గాయపరిచినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు... అల్మాస్‌పేటకు చెందిన జియావుద్దీన్ సోమవారం రాత్రి ఇంటి సమీపంలో ఉండగా అదే ప్రాంతానికి చెందిన షైనీ, రత్తైబ్ అలియాస్ కల్లు, షబ్బీర్, బబ్లు అలియాస్ బాంబేలు మాటామాటా పెరిగి జియావుద్దీన్ వీపుపై కత్తితో పొడిచినట్లు తెలిపారు. చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా, మెరుగైన చికిత్స కోసం హైదరాబాదుకు తరలించారు. ఐదుగురిపై కేసు నమోదు చేశామని తెలిపారు. కాగా నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధాన నిందితుడు షైనీ పరారీలో ఉన్నట్లు సమాచారం. అతడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.


లక్కిరెడ్డిపల్లె: మానవహారం నిర్వహిస్తున్న మహిళలు అధికారులు


ఓటు వినియోగంపై ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దారు జ్ఞానేశ్వరి అధికారులు


సుండుపల్లెలో ఓటు హక్కుపై ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు


పుల్లంపేటలో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

రైల్వేకోడూరు, మార్చి 19: ఓటు వజ్రాయుధం అని రైల్వేకోడూరు తహసీల్దార్ శివరాముడు తెలిపారు. మంగళవారం రైల్వేకోడూరు వెలుగు కార్యాలయంలో ఓటు హక్కుపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో ఓటును ప్రతి భారతీయ పౌరుడు వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ రోజున ఎలాంటి సమస్యలు లేకుండా ప్రశాంతంగా ఓటును వేసుకోవాలన్నారు. ఓటు వేయడం బాధ్యతగా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం రవికుమార్, మహిళలు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : మండలంలోని స్త్రీ శక్తి భవన్‌లో ఓటరు అవగాహన దినోత్సవం నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ, అనంతరం రైల్వేస్టేషన్ సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. ప్రజలందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. 18ఏళ్లు నిండిన వారందరూ ఇంకా ఓటు నమోదు చేసుకోవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి.కుళ్లాయి స్వామి, డిప్యూటీ తహసీల్దారు మున్ని, ఈవోపీఆర్ అండ్ ఆర్‌డి రామ్మోహన్‌రెడ్డి, ఏపీఎం ఆర్ముగం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు, వెలుగు సిబ్బంది, డ్వాక్రా సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సుండుపల్లె: ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా, స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని తహసీల్దార్ జరీనాబేగం, ఎంపీడీవో అమర్‌నాథ్, ఎస్ఐ-2 నారాయణ కోరారు. మంగళవారం సుండుపల్లె మండల కేంద్రంలో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సురేశ్‌బాబు, పంచాయతీ కార్యదర్శి సురేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధంలాంటిదని నియోజకవర్గ నోడల్ ఆఫీసర్ కుమారుస్వామి తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ర్యాలీ ప్రారంభించిమూడు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో


పెనగలూరు మూడు రోడ్ల కూడలిలో మానవహారం ఏర్పాటు చేసి ఓటర్లను జాగృతం చేస్తున్న అధికారులు

ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి, ఏపీఎం నిరంజన్, డీటీ రెడ్డెన్న, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, వర్కర్లు, ఆయాలు, ఆశవర్కర్లు మహిళా సంఘాలు పాల్గొన్నారు.

రామాపురం: వెలుగు కార్యాలయం నుంచి మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో ప్రభాకర్, తహసీల్దార్ శ్రీనివాసులు, వెలుగు ఏపీఎం దేవసేన, ఎంటీ మధుకర్, మండల యాంకర్ వెంకట్రామిరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మజ, సుజాత, హుస్సేనమ్మ, యానిమేటర్లు, అర్థిక అక్షరాస్యత కేంద్ర నిర్వాహకులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

చిట్వేలి: ఓటు హక్కు ప్రాథమిక బాధ్యత అని ప్రజలు గ్రహించాలని తహసీల్దారు జ్ఞానేశ్వరి తెలిపారు. మంగళవారం చిట్వేలిలో ఎంపీడీవో రంగారావుతో కలిసి చిట్వేలిలో ఓటరు అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఓటు కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వినియోగించుకోవాలని, కొత్తగా ఓటు హక్కు కోసం ఫార్మ 6 ద్వారా నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో వసుంధరమ్మ, సురేఖ, రాణి, రాజేశ్వరి, వీఆర్వో భుజంగరావు, అంగన్‌వాడీ వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీరబల్లి: మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఓటు హక్కు అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్ఐ చంద్రమోహన్, ఏపీఎం ఖాదర్‌వలి, సీసీలు, గ్రామ లీడర్లు, సిబ్బంది, మండల పరిషత్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పుల్లంపేట: పుల్లంపేటలో మంగళవారం ఓటు హక్కు వినియోగంపై తహసీల్దారు శ్రీనివాసరాజు, ఎంపీడీవో నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం నుంచి ప్రధాన రహదారితో పాటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. రెవెన్యూ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

చిట్వేలి: ప్రశాంత ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించాలని రాజంపేట డీఎస్పీ చైతన్య ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం సి.కందులవారిపల్లె పంచాయతీ తుమ్మచెట్లపల్లె, హరిజనవాడ, ఎస్టీ కాలనీల్లో ఓటు హక్కు వినియోగంపై అవగాహన, కేంద్ర పోలీసు బలగాలు ఫ్లాగ్ మార్చ్, కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు సీఐ సురేంద్రనాధ్‌రెడ్డి, ఆర్వో లీలారాణి, తహశీల్దారు జ్ఞానేశ్వరి, ఎస్ఐ సుధాకర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు : మండల పరిషత్ కార్యాలయం నుంచి డ్వాక్రా గ్రూపు మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలతో పెనగలూరు బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించి మూడు రోడ్ల కూడలిలో మానవహారం ఏర్పాటు చేశరు. తహసీల్దారు సీహెచ్ ఇంద్రాణి, ఎంపీడీవో హరిప్రసాద్, ఏపీఎం నిరంజన్, ఎస్ఐ ఈఎస్ సుభాష్ చంద్రబోస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయకుమారి, విశాలాక్షి వెలుగు మండల పరిషత్ రెవెన్యూ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

నిజం గెలవాలి యాత్రకు ముమ్మరంగా ఏర్పాట్లు


'నిజం గెలవాలి' ఏర్పాట్లలో సుగవాసి

రాయచోటిటౌన్, మార్చి 19: నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా గాలివీడు మండలం ఎగువగొట్టివీడు గ్రామంలో బుధవారం టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి పర్యటిస్తుండడంతో అందుకు సంబంధించిన ఏర్పాట్లను రాజంపేట పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం పరిశీలించారు. ఎగువగొట్టివీడు గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ ప్రభాకర్‌నాయుడు, నాగేశ్వర నాయుడు, శరణ్‌కుమార్‌నాయుడు, రమణ, వీరభద్ర జూనియర్ కళాశాల కరస్పాండెంట్ రాజశేఖర్, మైనార్టీ నాయకులు ఇర్షాద్‌అలీఖాన్, బాషా తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు(రూరల్): మాజీ ముఖ్యమంత్రి టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి రేపు కోడూరుకు వస్తున్నట్లు టీడీపీ సీనియర్ నాయకుడు కస్తూరి విశ్వనాథ్ నాయుడు తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో పార్టీ నాయకులతో మాట్లాడుతూ ఈ పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ గురుమహేష్, డాక్టర్ దీప

ఓబులవారిపల్లె, మార్చి19 : మండలంలోని అయ్యలరాజుపల్లె హరిజనవాడలో డెంగ్యూ కేసులు వెలుగులోకి రావడంతో ప్రభుత్వ వైద్య సిబ్బంది జ్వరాలతో బాధపడుతున్న వారి ఆరోగ్య పరిస్థితిపై పర్యవేక్షిస్తున్నారు. మంగళవారం జ్వరాలతో ఇబ్బంది పడుతున్న వారి కుటుంబసభ్యులు, చుట్టుపక్కల ఇళ్ల వారికి సూచనలిచ్చారు. పాఠశాల ప్రాంగణంలో డాక్టర్ గురుమహేష్, డాక్టర్ దీప వైద్య పరీక్షలు నిర్వహించారు జరిగింది. మలేరియా సబ్ యూనిట్ అధికారిణి కృష్ణమ్మ, ఆధ్వర్యంలో లార్వా సర్వే నిర్వహించారు. ల్యాబ్ టెక్నీషియన్ కరుణ, సూపర్‌వైజర్ అరుణ, ఏఎన్ఎంలు గీత, శైలజ, నర్సులు గంగారత్న, నీరజ కుమారి, ఆశ కార్యకర్తలు సుబ్బలక్ష్మి, గంగాదేవి పాల్గొన్నారు.

చెన్నరాజుపోడులో ఎన్ఎస్ఎస్ శిబిరం



ఎన్ఎస్ఎస్ శిబిరంపై వివరిస్తున్న అధికారులు

ఓబులవారిపల్లె, మార్చి19 : మండలంలోని చెన్నరాజుపోడులో మంగళవారం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యానవన కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దీప్తి కిరణ్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో మొదటి రోజు ఇంటింటా సర్వే చేసి, సమస్యలకు అనుగుణంగా కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సురేంద్రనాద్ రెడ్డి, పీవో డాక్టర్ శిరీష, వీహెచ్ఏ యశ్వంత్, గ్రామ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రధానికే భద్రత కల్పించలేని ప్రభుత్వం


మాట్లాడుతున్న మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, మార్చి19: దేశ ప్రధాని నరేంద్రమోడీకి భద్రత కల్పించలేని ఈ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఏం భద్రత కల్పిస్తుందని రాయచోటి నియోజకవర్గ టీడీపీ నేత మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ఎస్ఎన్‌కాలనీలోని టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ప్రజాగళం సభ భద్రతలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసు ఉన్నతాధికారులపై చీఫ్ ఎలెక్షన్ కమిషన్ తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లక్షలాది మంది జనం తోసుకొస్తుంటే నియంత్రించాల్సిన పోలీసులు చోద్యం చూడటం దేనికి సంకేతం అని ప్రశ్నించారు. ప్రభుత్వ చేతగానితరం, పోలీసుల నిర్లక్ష్యంతో వేలాది మంది సభకు రాలేకపోయారన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం


సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

రాయచోటిటౌన్, మార్చి 19: పట్టణంలోని రెడ్డీస్ కాలనీలో ఉన్న రామాంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. పోలిరెడ్డి దామోదర్‌రెడ్డి, రెడ్డిలత, పోలిరెడ్డి రామ్‌సతీశ్‌రెడ్డి, అనూష దంపతుల ఆధ్వర్యంలో ఆలయ కమిటీ నిర్వాహకులు కావలి వెంకటసుబ్బారెడ్డి పర్యవేక్షణలో అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. కల్యాణోత్సవానికి హాజరైన భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ముగిసిన యల్లమ్మ తిరుణాల

సుండుపల్లె, మార్చి19: మండల కేంద్రానికి సమీపంలోని యల్లారెడ్డిగారిపల్లె సమీపంలో ఉన్న యల్లమ్మ ఆలయంలో మంగళవారం పుట్టమన్ను తీసుకొచ్చి పూజలు చేశారు. సోమవారం రాత్రి, మంగళవారం తెల్లవారు జామున భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా తిరుణాల మహోత్సవాన్ని ఎంతో ఘ నంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు శివారెడ్డి దంపతులు, కుటుంబ సభ్యులు చాందినీ బండ్లు కట్టి సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా చెక్కభజనలు, కోలాటాలు నిర్వహించారు.

ఘనంగా రాంప్రసాద్‌రెడ్డి జన్మదిన వేడుకలు

సంబేపల్లె, మార్చి19: రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, లక్ష్మీప్రసాద్‌రెడ్డి జన్మదిన వేడుకలు దేవపట్లలో మంగళవారం రాజంపేట పార్లమెంట్ తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి పొత్తూరు అశోక్‌చౌదరి ఆధ్వ ర్యంలో ఘనంగా నిర్వహించారు. రాజంపేట పార్లమెంట్ తెలుగు యువత అధికార ప్రతినిధి గంగాదర్‌నాయుడు,బాబురెడ్డి, శంకర, బాలాజీ, అఖిల్‌రెడ్డి, ప్రసాద్‌నాయుడు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: ఎంపీటీసీ మాజీ సభ్యుడు మదన్‌మోహన్, ఆరీఫుల్లా ఆధ్వర్యంలో రాయచోటి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అసెంబ్లీ అభ్యర్థి మండిపల్లె రాంప్రసాదురెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. రాజంపేట పార్లమెంటు డాక్టర్ల సంఘం కార్యదర్శి డాక్టర్ షిపినాయక్, కాంట్రాక్ట్ వెంకటరామరాజు, ఎం వెంకటరామరాజు, చోటా, అంజాద్, మసూద్, ఓబులేసుయాదవ్, మండ్లరామాంజనేయులు, వీరబల్లి కృష్ణయ్య, హరి, భాస్కర్‌రెడ్డి, బషీర్, మల్లికార్జున, జేకే టైలర్ రాజా తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఈ విద్యార్థులకు వర్క్‌షాపు


ఈఈఈ విభాగం వర్క్‌షాపులో విద్యార్థులు

రాజంపేట, మార్చి19: అన్నమాచార్య ఈఈఈ విభాగంలో కళాశాల ప్రాంగణంలో మూడు రోజుల పాటు వర్క్‌షాపు కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ వర్క్‌షాపును డాక్టర్ కె.బి.సి.గణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిగ్నల్ సిస్టమ్, టోల్ గేట్ బ్లూటూత్ కంట్రోల్, స్పీడ్ కంట్రోల్ తదితర అంశాలపై బీటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎస్ఎంవీ నారాయణ, వైస్ ఛైర్మన్ చొప్పా యల్లారెడ్డి, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ పద్మలలిత, కో-ఆర్డినేటర్ ధనుంజయబాబు, బయ్యారెడ్డి, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్‌లో బాలికలకు శిక్షణ


శిక్షణ పొందిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

రాజంపేట, మార్చి 19 : రాజంపేట అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో జేఎన్‌టీయూ అనంతపురం యూనివర్సిటీ స్థాయి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించారు. ఆరు రోజులుగా జరుగుతున్న ఈ శిబిరాలు మంగళవారంతో ముగిసాయి. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్‌ఛైర్మన్ చొప్పా యల్లారెడ్డి, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ నాగమునిరెడ్డి మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలతోనే కీర్తిప్రతిష్టలు లభిస్తాయని, ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయన్నారు. తమ కళాశాలలో యూనివర్సిటీ స్థాయి క్రీడా శిక్షణ కార్యక్రమాలు ఆనందదాయకమన్నారు. ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొన్న విద్యార్థు లను అభినందంఇచారు. ఈ కార్యక్రమంలో కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్ఎంవీ నారాయణ, కళాశాల పరిపాలన అధికారి నూకా సుబ్బారెడ్డి, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ సైఫుల్లా తదితరులు పాల్గొన్నారుథ

గ్రామదేవతలకు అభిషేకం, పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

సుండుపల్లె, మార్చి19: మండలంలోని మాచి రెడ్డిగారి పల్లె గ్రామ పంచాయతీ మిట్ట బిడికి సమీపంలో మంగళ వారం మారెమ్మ, కాళికాదేవి ఆలయ వార్షికోత్సవాన్ని నిర్వహిం చారు. ఉదయం అమ్మ వార్లను ప్రత్యేకంగా అలంకరించి పట్టు వస్త్రాలను సమర్పిం చారు. అనంతరం పూజలు చేశారు. సేవాలాల్ మహరాజ్‌కు ప్రత్యేక పూజ లు నిర్వహించారు. హాజరైన భక్తులకు దాతల సహ కారంతో అన్నదానం చేశారు.

నేడు సంత హక్కుల వేలం

సుండుపల్లె, మార్చి19: సుండుపల్లె మండల కేంద్రంలోని కూరగాయల మార్కెట్, పశువుల సంతలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో సెస్సు వసూలు హక్కులకు బుధవారం వేలం నిర్వహిస్తున్నట్లు ఈవోపీఆర్‌డీ సురేశ్ బాబు తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు కూరగాయల మార్కెట్, మధ్యాహ్నం 3 గంటలకు పశువుల సంత వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల వారు కూరగాయల మార్కెట్ కు రూ.500, పశువుల సంతకు రూ.300 ధరావతు చెల్లించి పేర్లను నమోదు చేసుకొని పంచాయతీ కార్యదర్శి సురేశ్‌బాబు దగ్గర రసీదు తీసుకోవాలన్నారు.

ఘనంగా ధ్వజస్థంభం ప్రతిష్ఠ

గాలివీడు, మార్చి 19: మండల కేం ద్రంలోని పెద్దూరు బ్రాహ్మణవీధిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠిం చారు. ఉదయం ఆలయంలో గణ పతిపూజ,హోమం నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాదాల వితర ణ చేశారు. బుధవారం ఉదయం ప్రాణప్రతిష్ఠ, కల్యాణోత్సవం అనంతరం మధ్యాహ్నం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో కొండారెడ్డి, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైసీపీ సమావేశంపై ఫిర్యాదు

సిద్దవటం, మార్చి19 : సిద్దవటం మండలం కడప-చెన్నై రహదారి ఉప్పరపల్లి సమీపంలోని శ్రీ కనకదుర్గ కళ్యాణ మండపంలో వైసీపీ నేతలు ప్రభుత్వ అనుమతి లేకుండా సోమవారం కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. దీంతో ఎన్నికల కోడ్ ఉల్లంఘించారంటూ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలియజేశారు.

కార్యకర్తలు అసహనానికి గురి కావద్దు : కస్తూరి


మండలస్థాయి టీడీపీ నాయకులతో కస్తూరి విశ్వనాథ నాయుడు

పెనగలూరు, మార్చి 19: టీడీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు అసహనానికి గురికావద్దని ప్రతి కార్యకర్తకు న్యాయం చేసేందుకు అధిష్టానం అండగా ఉంటుందని రైల్వేకోడూరు టీడీపీ మాజీ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథనాయుడు అన్నారు. మంగళవారం ఆయన మండలంలో పర్యటించి తనకు సహాయ సహకారాలు అందించిన కార్యకర్తలు, నాయకులు, అభిమానులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా నారాయణ నెల్లూరు, సింగారెడ్డిపల్లె, సింగనమల, ఈటిమాపురం, కట్టావారిపల్లె, పెనగలూరు, నర్సింగరాజపురం గ్రామాల్లోని క్రియాశీలక కార్యకర్తలను, నాయకులను కలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి ఎవరైనా సరే అతని విజయానికి పాటుపడదామని సూచించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు అరాచక పాలనతో విసిగి భయానకవాతావరణంలో ఉన్నప్రజలు స్వేచ్ఛగా జీవించాలంటే ఉమ్మడి అభ్యర్థిని గెలిపించుకోవడం ప్రధానకర్తవ్యమని సూచించారు. నారాయణనెల్లూరు సీనియర్ నాయకుడు మల్లయ్య, మాజీ సర్పంచ్ తోట పిచ్చయ్య, మండల ప్రధాన కార్యదర్శి కళాచంద్ర, జిల్లా అధికార ప్రతినిధి కొత్త బాలకృష్ణ, క్లస్టర్ ఇన్‌చార్జి నాగేశ్వరనాయుడు, పార్లమెంటు యువత అధ్యక్షుడు రాంప్రసాద్‌నాయుడు, రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ కార్యదర్శి షామీర్, సీనియర్ నాయకులు యానాదయ్య, కృష్ణయ్య, సుబ్రమణ్యం, జి.మహేంద్ర, సుబ్బనరసయ్య, కత్తి సుబ్బరాయుడు, మహిళానాయకులు నగిరిపాటి రేవతి, దుద్యాల అనిత దీప్తి తదితరులు పాల్గొన్నారు.

కాపీయింగ్‌తో ప్రతిభావంతులకు అన్యాయం



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ నాయకులు

రాజంపేట టౌన్, మార్చి19 : ఎస్ఎస్‌సి పరీక్షల్లో కాపీయింగ్‌తో ప్రతిభ గల విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నేతగాని నాగేశ్వర, భారత్ విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి సర్వేపల్లి నరసింహులు విమర్శించారు. కొన్ని ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు బయటి వ్యక్తులను ప్రోత్సహించి 100 శాతం పాస్ పర్సంటేజ్ తెప్పించి విద్యను వ్యాపారం చేయడం కోసం ఇతర విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. కోడూరు పట్టణంలోని పలు పరీక్ష కేంద్రాల వద్ద కిటికీల్లోంచి తమ విద్యార్థులకు చిట్టీలు అందిస్తున్నా పోలీసులు, పరీక్ష కేంద్రాల చీఫ్‌లు ప్రైవేటు పాఠశాల లయాజమాన్యాలతో లాలూచీ పడి చూస్తూ ఊరుకుంటున్నారన్నారు. ఈ విషయంలో మండల విద్యాశాఖాధికారులు సూత్రధారుల్లా వ్యవహరిస్తున్నారన్నారు. ఇలాంటి వారిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ డిమాండ్ చేస్తున్నాయన్నారు. ఈ మేరకు రాజంపేట ఆర్డీవో కార్యాలయంలో ఏవో సత్యానంద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం మండల నాయకులు రాజశేఖర్, ఆకేపాటి శివతేజ, కొప్పల కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు పోతేగానీ పట్టించుకోరా?

● దేంజర్‌జోన్‌లోని గ్రామాన్ని తరలించండి ● మంగంపేట అగ్రహారం వాసుల ఆవేదన


బ్లాస్టింగ్ కారణంగా కూలిన వసారా

ఓబులవారిపల్లె, మార్చి 19: డేంజర్ జోన్ పరిధిలోని మంగంపేట అగ్రహారంలో మంగళ వారం సాయంత్రం 6 గంటలకు తొలికొండ వెంకటరమణ భార్య వంట చేసుకుంటుండగా ఇంటి ముందున్న రేకుల వసారా కుప్పకూలింది. గోడ పాక్షికంగా దెబ్బతినింది. దాని కింద ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇదే గ్రామంలో గతంలో ఒక బాలుడు గోడకూలి మరణించిన సందర్భంలో ఏపీఎండీసీని ముట్టడించినప్పుడు తక్షణమే గ్రామాన్ని ఖాళీ చేస్తామని చెప్పిన అధికారులు ఇంత వరకు పట్టించుకున్న పాపాన పోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు పడితే ఇలాంటి ఇళ్లు అనేకం కుప్పకూలేందుకు సిద్ధంగా ఉన్నాయని, ఈ గ్రామంలో ఏ చిన్న పొరపాటు జరిగినా దానికి పూర్తి బాధ్యత ఏపీఎండీసీ యాజమాన్యం వహించాల్సి వస్తుందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాన్ని తరలించాలని ఎన్ని మార్లు విన్నవించుకున్న అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని గ్రామస్తులు తెలిపారు.

పొలాల్లో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు


కిందికి ఒరిగిపోయిన 11కేవీ విద్యుత్ తీగలు

సిద్దవటం, మార్చి19 : సిద్దవటం మండలం వెంకటాయపల్లె గ్రామ సమీపంలోని పొలాల్లో అతి తక్కువ ఎత్తులో 11కేవీ విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పలు మార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసిన వారు ఏ మాత్రం స్పందించడం లేదని అంటున్నారు. వీటి కారణంగా రాత్రి వేళల్లో పొలం పనులకు వెళ్లాలంటే భయంగా ఉంటోందని పులపర్తి రామకృష్ణ అనే రైతు అంటున్నారు. ప్రస్తుతం దాదాపు ఆరు ఎకరాల్లో సాగు చేసి వరిపైరు కోతకు వచ్చిందని, దాంతో వరికోత యంత్రం పొలంలోకి తీసుకురావడం ఇబ్బందిగా మారిదని అంటున్నాడు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ లైన్లు మరింత ఎత్తులో ఏర్పాటు చేయాలని రైతు కోరుతున్నాడు. ఈ విషయమై సిద్దవటం ఏఈని వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి రాలేదని విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బలిజసేన అధ్యక్షుడుగా సుంకర రవిచంద్ర

రైల్వేకోడూరు, మార్చి 19: నియోజకవర్గ బలిజసేన అధ్యక్షుడుగా సుంకర రవిచంద్రను నియమిస్తూ మంగళవారం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గంలో బలిజసేనను బలోపేతం చేస్తామని తెలిపారు.

ఉద్యోగ నియామకాల మెరిట్ లిస్టు విడుదల చేయండి

మదనపల్లె టౌన్, మార్చి 19: మదనపల్లె మెడికల్ కాలేజి, జనరల్ ఆస్పత్రిలో ఇటీవల ఉద్యోగాల నియామకాల మెరిట్‌లిస్టు విడుదల చేయాలని కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్, కౌన్సిలర్, అటెండర్లు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ జమునకు సమాచారహక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకోవడంతో పాటు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నోటిఫికేషన్ ప్రకారం ఉద్యోగాల నియామకం వివరాలను చిత్తూరు జిల్లా ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో అన్ని కేటగిరిల ఉద్యోగాలకు సంబంధించి ప్రొవిజన్ మెరిట్ లిస్టు పెట్టలేదన్నారు. పూర్తి మెరిట్ పాయింట్లు, అనుభవం వున్న తమలాంటి వారికి అన్యాయం జరుగుతోందన్నారు.

ఇరువర్గాల దాడి : ఇద్దరికి గాయాలు

మదనపల్లె అర్బన్, మార్చి 19: ఇరువర్గాలదాడిలో ఇద్దరికి గాయాలైనట్లు రూరల్ సీఐ శేఖర్ తెలిపారు. బసినికొండ పం చాయతీలో బైపాస్‌రోడ్డులో హోటల్స్ నిర్వహిస్తున్న ఇరువర్గాలు మంగళవారం దాడి చేసుకున్నారు. అక్షింతలు చల్లారని తిడుతు న్న శ్రీనివాసులు, జనార్ధనరెడ్డిలపై పక్క హోటల్ యాజమానులైన బాలకృష్ణ, అతని కుటుంబసభ్యులు, అనుచరులు కర్రల తో బాధితులపై గాయాలు చేశారు. గాయపడి న ఇరువురిని స్థానికులు చికిత్స నిమిత్యం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలిం చారు. రూరల్ ఎస్ఐ రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

..అయినా రంగు మారలేదు

కార్వేటినగరం, మార్చి 19: ఎన్నికల కోడ్ వచ్చింది. నిబంధనల ప్రకారం ప్రభుత్వ కార్యాలయాలకు పార్టీ రంగులు ఉండకూడదు. కానీ, కార్వేటిన గరం మండల కాంప్లెక్స్ ప్రవేశ ద్వారం వద్ద ఉన్న ఒక స్తంభానికి, లోపల వైపున ఉన్న మరో రెండు స్తంభాలకు వైసీపీ రంగులను ఇంకా తొలగించలేదు. ఈ రంగులకు ఎన్నికల కోడ్ వర్తించదా అని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా మండల కాంప్లెక్స్ ప్రవేశ ద్వారానికి ఉన్న రంగులను తొలగించాల్సి ఉంది.


వైసీపీ రంగులతో మండల కాంప్లెక్స్ సముదాయం

అలాగే.. సిమెంటు బెంచీ

చిత్తూరు సిటీ: ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో టీడీపీ రంగులు, అభ్యర్థి ఫొటోలు ఎక్కడున్నా అధికారులు తొలగిస్తున్నారు. కానీ, ఇప్పటికీ వైసీపీ రంగులు చిత్తూరు నగరంలో కనిపిస్తూనే ఉన్నాయి. ప్రధానమైన జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో బహిరంగ ప్రదేశంలో వైసీపీ రంగులతో చైర్‌పర్సన్ ఎం.రెడ్డెమ్మ పేరుతో ఉన్న సిమెంట్ బెంచీ కనిపించడం విమర్శలకు తావిస్తోంది. అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించి.. వీటినీ తొలగించాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయి.


డీసీసీబీ ఆవరణలో వైసీపీ రంగులతో సిమెంట్ బెంచీ

డీఎంహెచ్‌వో కార్యాలయంలో స్పందన కార్యక్రమం

చిత్తూరు రూరల్, మార్చి 19: చిత్తూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు తమ సమస్యలను డీఎంహెచ్‌వోకు విన్నవించుకున్నారు. ఉద్యోగులు మాట్లాడుతూ తమ శాఖకే ప్రత్యేకంగా గ్రీవెన్స్ సెల్ నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. తమ సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం ఒక్క రోజే 80 వినతులు వచ్చాయని, వాటిని పరిశీలించిన త్వరితగతిన పరిష్కరిస్తామని డీఎంహెచ్‌వో తెలిపారు.


వినతులు స్వీకరిస్తున్న డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి

వీడని ఏనుగుల దాడులు

సదుం, మార్చి 19: మండల పరిధిలోని అటవీ శివారు ప్రాంత గ్రామాల పరిసర ప్రాంతాల్లో ఏనుగుల దాడులు ఆగడంలేదు. మంగళవారం తెల్లవారుజామున జోగివారిపల్లె పంచాయతీ నాయునివారిపల్లె గ్రామ సమీపంలో ఏనుగుల గుంపు సంచరించింది. రైతు సుబ్రహ్మణ్యానికి చెందిన మామిడి చెట్లను విరిచేశాయి. లోకనాథం, మల్లిఖార్జున, రమణారెడ్డిలకు చెందిన వరి పంటను తొక్కి పంట నష్టంచేశాయి. ఫారెస్టు సెక్షన్, బీట్ ఆఫీసర్లు సురేంద్ర, మహేశ్‌లు ట్రాకర్స్‌తో వెళ్లి ఏనుగుల గుంపును గుర్తించి నాయునివారిపల్లె అటవీ ప్రాంతంలోని నీళ్ల కుంట వైపు మళ్లించారు. ఐరాల, దామలచెరువు అటవీ ప్రాంతం నుంచి ఏనుగుల గుంపు వచ్చినట్లు వారు తెలిపారు. పెద్ద ఉప్పరపల్లె, నాయన వారిపల్లె, బత్తలవారి పల్లె వాసులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పంట నష్ట పరిహారం కోసం అధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు.


ఏనుగుల దాడిలో నేలకొరిగిన మామిడి చెట్ల వద్ద రైతు సుబ్రహ్మణ్యం

వాహనం ఢీకొని దుప్పికి గాయం

వెదురుకుప్పం, మార్చి 19: వెదురుకుప్పం మండలం ఎర్రగుంటపల్లి సమీపంలో మంగళవారం ఓ దుప్పి దారి తప్పి రహదారిపైకి వచ్చింది. ఆ దుప్పిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గాయపడి రోడ్డుపైనే పడిపోయింది. ఆ తర్వాత కుక్కల దాడిలో గాయపడిందన్న ప్రచారం జరిగింది. స్థానికులు గమనించి.. ఆ దుప్పిని తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం బాదూరు పశువైద్యశాలకు తరలించారు.



అలిపిరి కాలినడక మార్గంలో జెర్రిపోతు

తిరుమల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అలిపిరి కాలినడకమార్గంలో మంగళవారం సుమారు ఆరడుగుల పొడవైన జెర్రిపోతు పాము పట్టుబడింది. దివ్యారామానికి సమీపంలోని నేపాలి సెక్యూరిటీ షెడ్‌లోకి ఈ పాము ప్రవేశించింది. గుర్తించిన సిబ్బంది భయంతో బయటకి పరుగులు తీశారు. వెంటనే పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్ నాయుడికి సమాచారమిచ్చారు. ఆయన అక్కడికి చేరుకుని ఆ పామును చాకచక్యంగా పట్టుకున్నాడు. పట్టుబడిన పామును దట్టమైన అడవిలో విడిచిపెట్టాడు.



పటిష్ఠంగా ఎన్నికల కోడ్ అమలు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 19: జిల్లాలో ఎలక్షన్ షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్ఠంగా అమలు చేస్తున్నామని ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ అన్నారు. అమరావతి నుంచి మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మీనా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తన క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టరు పాల్గొన్నారు. ఇప్పటికే జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధికి సంబంధించి పీవో, ఏపీవోలకు ఎన్నికల నిర్వహణపై తొలివిడత శిక్షణ ఇచ్చామని చెప్పారు. ప్రభుత్వ, ప్రభుత్వ సంస్థల ప్రాంగణాల్లో, వాణిజ్య స్థలాల్లో ఎటువంటి హోర్డింగులు, బ్యానర్లు, పోస్టర్లు అనుమతించవద్దని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచించారు. సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలకు క్షేత్రస్థాయిలో నియమావళిని పటిష్ఠంగా అమలు చేయాలన్నారు.

పార్టీల కార్యక్రమాల్లో పాల్గొంటే చర్యలు

చిత్తూరు రూరల్: వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఎవరైనా రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో పాల్గొంటే క్రమశిక్షణా చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి హెచ్చరించారు. సోమవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిననంతరం పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బందితో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల కోడ్ దృష్టిలో ఉంచుకొని నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. ఎవరైనా, ఎక్కడైనా రాజకీయ సమావేశాల్లో, నేతలతో ఫొటోల్లో కనిపిస్తే సస్పెండ్ చేస్తామన్నారు. 108, 104, తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్‌పై వాహనాలపై రాజకీయ నాయకుల ఫొటోలు తొలగించాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఐవో రవిరాజు, వైద్యులు జానకీరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో అనుమతి తీసుకున్నాకే ఎన్నికల ప్రచారం చేయండి

● టీడీపీ అభ్యర్థికి చెప్పిన అధికారులు

గంగాధరనెల్లూరు, మార్చి 19: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో.. రిటర్నింగ్ అధికారి వద్ద అనుమతి తీసుకున్నాకే గ్రామాల్లో ప్రచారం చేయాలని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్‌కు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిణి పద్మసునంద సూచించారు. గంగాధరనెల్లూరు మండలంలో మంగళవారం స్థానిక నేతలతో కలిసి ఆయన ప్రచారం ప్రారంభించారు. మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో ఆ అధికారిణి వచ్చి అభ్యంతరం చెప్పారు. తామేమి మైకులు ఏర్పాటు చేయలేదని, సభలు, సమావేశాలు నిర్వహించలేదని థామస్ చెప్పగా.. ఇంటింటి ప్రచారానికీ ముందుగా అనుమతి తీసుకోవాలని ఆమె చెప్పారు. దీంతో నేతలు ప్రచారాన్ని ఆపి.. తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఏఆర్వో రవితో మాట్లాడారు. ఆయన సూచన మేరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయగా.. ప్రచారానికి అనుమతి వచ్చింది. ఈకార్యక్రమంలో నేతలు వెంకటేష్, శ్రీధర్‌యాదవ్, దేవరాజులు, స్వామిదాస్, బాలచంద్రారెడ్డి, దేవసుందరం, కోదండరెడ్డి, మునిరాజులయాదవ్, అంజనేయులుశెట్టి, శివప్రసాద్, క్రిష్టారెడ్డి, సోమచంద్రారెడ్డి, జ్యోతియాదవ్, సతీష్, సగికుమార్ పాల్గొన్నారు.

కార్వేటినగరం: ఆర్వో నుంచి ముందస్తు అనుమతి తీసుకోకుండా మంగళవారం ఉదయం కార్వేటినగరం మండలం సురేంద్రనగరంలో వైసీపీ అభ్యర్థి కృపాలక్ష్మి ప్రచారం చేపట్టారు. ఈ విషయం తెలిసి పంచాయతీ కార్యదర్శి లక్ష్మీపతి ఆమె ప్రచారాన్ని అడ్డుకున్నారు. ఆ తర్వాత ఆమె కూడా అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నారు.

ఆస్పత్రి ఆవరణలో మద్య సేవనం

విధుల్లో ఉండగా పట్టుబడ్డ రుయా వాటర్ మ్యాన్ ● బార్‌ను తలపించేలా సీఐటీయూ కార్యాలయం



నాలుగు రోజుల కిందట విధుల్లో ఉండగా మరో వ్యక్తితో కలిసి మద్యం తాగుతూ పట్టుబడ్డ ఉద్యోగి - సీఐటీయూ కార్యాలయంలో మద్యం బాటిళ్లు, గ్లాసులు

తిరుపతి సిటీ, మార్చి 19: రుయాస్పత్రి ఆవరణలోని ఓ కార్యాలయం వెనుక గదిలో మరో వ్యక్తితో కలిసి ఓ ఉద్యోగి మద్యం తాగుతూ అధికారులకు పట్టుబడ్డాడు. ఆస్పత్రిలో వాటర్‌మ్యాన్‌గా పనిచేసే సుబ్రహ్మణ్యం ఓపీ కేంద్రం ఎదురుగా ఉన్న సీఐటీయూ కార్యాలయంలో నాలుగు రోజుల కిందట మధ్యాహ్నం మద్యం తాగుతున్నాడన్న సమాచారంతో ఏఆర్ఎంవో హరికృష్ణ అక్కడికెళ్లారు. మరో వ్యక్తితో కలిసి వాటర్ మ్యాన్ సుబ్రహ్మణ్యం మద్యం తాగుతుండటాన్ని గుర్తించారు. బారును తలపించేలా కార్యాలయం వెనుక ఓ గదిని ఏర్పాటు చేసి.. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విధుల్లో ఉండాల్సిన ఉద్యోగి దర్జాగా మద్యం తాగుతూ ఉండటాన్ని ఆయన గమనించి వెంటనే కార్యాలయానికి పిలిపించారు. కానీ తర్వాత ఏం జరిగిందో.. మద్యం తాగుతూ పట్టుబడ్డ ఉద్యోగిని మందలించి పంపేసినట్లు తెలిసింది. ఇదిలా ఉంటే.. వాటర్‌మ్యాన్‌కి అండగా అధికార పార్టీ నేతలు ఉండటంతో ఆయన గతంలోనూ విధుల్లో ఉన్నప్పుడు ఆస్పత్రిలోనే మద్యం తాగేవాడని చెబుతున్నారు. అధికార పార్టీ నేతలతో ఉన్న సంబంధాలకు తలొగ్గి.. అధికారులు సైతం ఆయనపై చర్యలు తీసుకోవడానికి సాహసించడం లేదన్న విమర్శలొస్తున్నాయి.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.78 కోట్లు

తిరుమల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.4.78 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు రూ.4.78 కోట్లు ఆదాయం లభించినట్టు మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 65,051 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 23,107 మంది తలనీలాలు సమర్పించారు.

వివాహితకు చిత్రహింసలు

● భర్తపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు

కుప్పం, మార్చి 19: పిల్లలు పుట్టలేదనే నెపంతో ఒక ప్రబుద్ధుడు తన భార్యను చిత్రహింసలకు గురిచేస్తున్నాడు. అంతే కాదు, ఓ బాలికను రెండో వివాహం కూడా చేసుకున్నాడు. దీనిపై ఆ వివాహిత మంగళవారం కుప్పం అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితురాలి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కుప్పం మండలం వసనాడుకు చెందిన శివశంకర్‌కు, మల్లూరు కృష్ణాపురం గ్రామానికి చెందిన హిమబిందుతో 2016 అక్టోబరు 13వ తేదీన వివాహమైంది. వారికి పిల్లలు కలగలేదు. ఈ నెపంతో భర్త శివశంకర్ తోపాటు ఆయన కుటుంబీకులు హిమబిందును చిత్రహింసలు పెట్టసాగారు. ఆరు నెలలకు ముందు బిహార్‌కు చెందిన ఓ బాలికను శివశంకర్ రెండో వివాహం చేసుకున్నాడు. ఆమెను వారం రోజుల క్రితం ఇంటికి తీసుకొచ్చాడు. రెండో పెళ్లి గురించి ప్రశ్నిస్తే, తనను కొట్టి చిత్రహింసలకు గురి చేస్తున్నాడు. పోలీసు అధికారులు తనకు న్యాయం చేయాలని హిమబిందు కోరారు.


పోలీసు స్టేషన్ ఎదుట పెళ్లి నాటి ఫొటో చూపిస్తున్న హిమబిందు

లక్ష్యం చేరే వరకు విశ్రమించొద్దు

● ఎంబీయూ విద్యార్థులకు మోహన్‌లాల్ పిలుపు
● ప్రధానిగా మళ్లీ మోదీయే రావాలన్న మోహన్‌బాబు



మోహన్‌బాబుతో మోహన్‌లాల్, మంచు విష్ణు

చంద్రగిరి, మార్చి 1 : ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దాన్ని సాధించే వరకు విశ్రమించొద్దని ప్రముఖ సినీనటుడు మోహన్‌లాల్ విద్యార్థులకు పిలుపిచ్చారు.చంద్రగిరి మండలం, ఎ.రంగంపేటలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో విద్యానికేతన్ విద్యాసంస్థల 32వ వార్షికోత్సవం, మోహన్‌బాబు జన్మదిన వేడుకలు మంగళవారం అట్టహాసంగా జరిగాయి.ముఖ్య అతిధులుగా ప్రముఖ సినీనటులు మోహన్‌లాల్, ముకేష్ రిషి హాజరయ్యారు. ఈ సందర్భంగా మోహన్‌లాల్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విద్యను ప్రసన్నం చేసుకొంటే ప్రపంచంలో ఏదైనా సాధించవచ్చని తెలిపారు.సినిమా రంగంలో కొనసాగుతూనే మోహన్‌బాబు విద్యాసంస్థను స్థాపించి విశ్వవిద్యాలయం స్థాయికి తీసుకురావడం అభినందించదగ్గ విషయమన్నారు. అనంతరం మోహన్‌బాబు మాట్లాడుతూ ప్రధానమంత్రిగా మళ్లీ నరేంద్ర మోదీయే రావాలని ఆకాంక్షించారు. ఏ పార్టీని నమ్మాలో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ప్రాంతీయ పార్టీల గురించి తాను ప్రస్తావించనని ,మళ్ళీ ప్రధానిగా నరేంద్రమోదీ వస్తే దేశం బాగుపడుతుందనేది తన మనసులో మాట అన్నారు. డబ్బులు అందరూ ఇస్తారని, అవి తీసుకుని మనసుకు నచ్చిన వారికే ఓటు వేయాలన్నారు.విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. హీరో విష్ణు కుమార్తె అరియాన ఆలపించిన పాశ్చాత్య సంగీతం ఆకట్టుకుంది.మనోజ్‌కుమార్ తనకు తండ్రితో ఉన్న అనుబంధాన్ని డాక్యుమెంటరీ రూపంలో ప్రదర్శించారు.ఎంబీయూ వీసీ నాగరాజ రామారావు, రిజిస్ట్రార్ డాక్టర్ సారధి, మోహన్‌బాబు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ఆధునికతను సంతరించుకున్న గ్రంథాలయాలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 19: గ్రంథాలయాలు ఆధునికతను సంతరించుకున్నాయని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ వీసీ కృష్ణమూర్తి అన్నారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రకు చెందిన 75 మంది జాతీయ గ్రంథాలయాల నిర్వాహకులకు ఎస్వీయూ సెనేట్ హాల్లో మంగళవారం మొదలైన పునశ్చరణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. ఎన్ఎంఎల్ అదనపు డైరెక్టర్ జనరల్ బీపీ శర్మ మాట్లాడుతూ.. దేశంలోని పబ్లిక్ లైబ్రరీల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని చెప్పారు.

ఉలిక్కిపడ్డ సూళ్లూరుపేట


ప్రమాదం జరిగిన గోదాము

బాణసంచా తయారీ కేంద్రంలో ప్రమాదం
ఆరుగురికి గాయాలు
ముగ్గురి పరిస్థితి విషమం

నిబంధనల ఉల్లంఘనపై లైసెన్సు రద్దుకు సిఫార్సు


ఆస్పత్రిలో క్షతగాత్రులు - కాలిన గాయాలతో రవి →



సూళ్లూరుపేట, మార్చి 19: టపాకాయల తయారీ కేంద్రంలో సంభవించిన పేలుడుతో మంగళవారం మధ్యాహ్నం తిరుపతి జిల్లా సూళ్లూరుపేట ఒక్కసారిగా ఉలిక్కిపడింది. పట్టణ సమీపంలోని వట్రపాలెం దగ్గర్లో జాతీయ రహదారి పక్కనే మదీనా గ్రాండ్ ఫైర్ వర్క్స్ పేరుతో బాణసంచా తయారీ కేంద్రం చాలాకాలంగా నిర్వహిస్తున్నారు. దీని లైసెన్సుదారులు ముతీష్, ఆయన భార్య సాధీనబేగం కాగా ఈ కేంద్రాన్ని ప్రస్తుతం వారి కుమారులిద్దరు నిర్వహిస్తున్నారు.11 గంటల సమయంలో టపాకాయల తయారీ కేంద్రంలో ప్రమాదం చోటు చేసుకోగా ఒక్కసారిగా భారీ శబ్దాలతో పేలుళ్లు సంభవించాయి.దీంతో ఎగిసిన మంటల తాకిడికి బయట ఉన్న టపాకాయల నిల్వలు కూడా పేలిపోయాయి.ఈ పేలుళ్ల ధాటికి గోదాములోనే పనిచేస్తున్న ముగ్గురు కూలీల శరీరం చాలావరకూ కాలిపోయింది. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిలో బీహార్‌కు చెందిన శంకర్ చౌదరి, పింకేష్ జాదవ్, రాజ్‌కుమార్, గండ్ మండేల్, జార్ఖండ్‌కు చెందిన రవిలతో పాటు వట్రపాలేనికే చెందిన కందుకూరి శివకుమార్ వున్నారు.గోడౌన్ నుంచి శబ్దాలు విన్న చుట్టుపక్కల జనం ఏమి జరిగిందో తెలియక టపాసుల గోడౌన్ వైపు పరుగులెట్టారు. పేలుళ్లు, మంటలతో ఉన్న వాతావరణం చూసి అందరూ భయపడిపోయారు. గోడౌన్ నుంచి మంటలతో కూడిన దట్టమైన పొగలు వస్తుండడంతో ఇంకా పేలుడు మందులు ఉన్నాయోమోనన్న అనుమానంతో అక్కడకు చేరుకొన్న జనాలు కొంతసేపు హైవే రోడ్డు పైనే ఉండిపోయారు.ఈలోపు క్షతగాత్రుల్లో ఇద్దరు మంటల్లో నుంచి బయటకు వచ్చి లోపల ఇంకా కూలీలున్నారని చెప్పడంతో కాలిన గాయాలతో ఉన్న నలుగురిని స్థానికులే బయటకు తీసుకొచ్చారు. వారిని ఆటోల్లో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకొన్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలను అదుపుచేశారు. ఆర్డీవో చంద్రముని, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, డీఎస్పీ శ్రీనివాసుల రెడ్డి, సీఐ మధుబాబు, ఎస్ఐ రహీం రెడ్డి అక్కడకు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలు తెలుసుకొన్నారు. బాణసంచా గోదాము వద్ద నిబంధనల మేరకు ఎటువంటి జాగ్రత్త చర్యలు కూడా లేనట్లు గుర్తించారు. పేలుడుకు సంబంధించి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టనున్నట్లు ఆర్డీవో తెలిపారు.తరువాత ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకొని క్షతగాత్రులను పరామర్శించి ప్రమాదం ఎలా జరిగిందో అడిగి తెలుసుకొన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తామన్నారు.తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం చెన్నైకి తరలించారు.పేలుడు సంఘటనపై కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు. టపాసుల తయారీ కేంద్రం లైసెన్సు రద్దుకు ఉన్నతాధికారులకు సిపార్సు చేశామని ఆర్డీవో తెలిపారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఆస్పత్రి వద్ద వైద్యులను వివరాలడిగి తెలుసుకొంటున్న ఆర్డీవో, డీఎస్పీ

చోరీ కేసులో నలుగురి అరెస్టు
ఆరు ద్విచక్ర వాహనాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలతో నిందితులను అరెస్టు చూపుతున్న సీఐ యువరాజ్

మదనపల్లె, మార్చి 19: వివిధ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను చోరీ చేసే నలుగురిని సభ్యులను అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ జి.యువరాజు తెలిపారు. స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. మదనపల్లె, పల మనేరు ప్రాంతాల్లో ద్విక్ర వాహనాలు చోరీ చేసిన అయిదుగురి అరెస్టు చేసి, వారి నుంచి రూ.8లక్షల విలువ చేసే ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో మదనపల్లె టూటౌన్‌లో రెండు కేసులు, పలమనేరు పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో పలమనేరు పట్టణం నాగమంగళానికి చెందిన సయ్యద్ జావీద్(20), పాతపేట-జండామటం ఏరియాకు చెందిన షేక్ ముజంబిల్ అలియాస్ మంజు(19), రంగాపురంవీధికి చెందిన పటాన్ ఇర్ఫాన్‌ఖాన్(20), పీటీఎం మండలం అంకిరెడ్డిపల్లెకు చెందిన కసుంపల్లె బాలు(21) అరెస్టు అయిన వారిలో ఉన్నారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు. ఈకేసులో ప్రతిభ చూపిన ఎస్‌ఐలు సి.వెంకటసుబ్బయ్య, ఎస్.ఇనయతుల్లా, కానిస్టేబుల్స్ పి.శంకర్, ఎస్.ప్రసాద్, బి.భద్రానాయక్, శివ, రెడ్డిశేఖర్, సిద్దేశ్వరలను డీఎస్పీ జి.ప్రసాద్‌రెడ్డి అభినందించారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం
నిందితుడు అరెస్టు

మదనపల్లె అర్బన్, మార్చి 19: రామసముద్రం మండలంలో కర్ణాటక మద్యం భారీగా స్వాధీనం చేసుకుని నిందితుడ్ని అరెస్టు చేసినట్లు మదనపల్లె రూరల్ సర్కిల్ సీఐ సద్గురు తెలిపారు. మంగళవారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మదనపల్లె డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో తమకు వచ్చిన సమాచారం మేరకు రామసముద్రం ఎస్‌ఐ చంద్రశేఖర్ తమ సిబ్బందితో వెళ్లి 8 కేసులు 768 ప్యాకెట్లులో రూ.58వేలు విలువ చేసే కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు జోగిండ్ల గ్రామ సమీపంలోని వెంకటప్ప పొలంలో నిల్వ చేసిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పుంగనూరు మండలం, అలజినేరు గ్రామానికి చెందిన ఎం. సుబ్రహమ్మణ్యం(28)ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఇరువర్గాల దాడిలో ఇద్దరికి గాయాలు

మదనపల్లె అర్బన్, మార్చి 19: ఇరువర్గాలదాడిలో ఇద్దరికి గాయాలైనట్లు రూరల్ సీఐ శేఖర్ తెలిపారు. బసినికొండ పంచాయతీలో బైపాస్‌రోడ్డులో హోటల్స్ నిర్వహిస్తున్న ఇరువర్గాలు మంగళవారం దాడి చేసుకున్నారు. అక్షింతలు చల్లారని తిడుతున్న శ్రీనివాసులు, జనార్ధనరెడ్డిలపై పక్క హోటల్ యాజమానులైన బాలకృష్ణ, అతని కుటుంబసభ్యులు, అనుచరులు కర్రలతో బాధితులపై గాయాలు చేశారు. గాయపడి న ఇరువురిని స్థానికులు చికిత్స నిమిత్యం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. రూరల్ ఎస్‌ఐ రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, మార్చి 19:నిమ్మనపల్లె మండలం, సోమను వారిపల్లెకు చెందిన పి. పవన్‌కు మార్(28)విషం ఆకులు తిని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అపస్మారకస్థితిలో ఉన్న పవన్ కుమార్‌ను కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అతనికి భార్య ప్రవీణా ఉంది.

రేషన్ డీలర్ మృతి



నాగరాజ (ఫైల్)

మదనపల్లె, మార్చి19: మదనపల్లెకి చెందిన సీనియర్ రేషన్ డీలర్, జేఎంసీ పెట్రోల్ బం కు అధినేత జయం నాగరాజ(72) మంగ ళ వారం మృతి చెందారు. ఈయన అకాల మరణం పట్ల వివిధ రాజకీయ పార్టీల నేత లు, రేషన్ డీలర్లు, వ్యాపారులు ప్రగాఢ సంతాపం తెలిపారు. నాగరాజు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించా రు. కాగా గురు వారం ఉదయం 11 గంటలకు అంత్రక్రియలు జరుగనున్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

వాహనం ఢీకొని విద్యార్థికి తీవ్రగాయాలు

ములకలచెరువు, మార్చి 19: మండలంలోని బురకాయలకోట పంచాయతీ బలకవారిపల్లెకు చెందిన జశ్వంత్‌కుమార్(25) అనే విద్యార్థి వాహనం ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఇంటర్మీడియట్ పరీక్షలు రాసి ఇంటి వద్దే ఉంటున్న అతను పని నిమిత్తం ద్విచక్రవాహనంలో బురకాయలకోటకు బయలుదేరి వస్తుండగా వాహనాన్ని బొలెరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో విద్యార్థి తీవ్రంగా గాయపడడంతో చి కిత్స నిమిత్తం 108 లో మదనపల్లె జి ల్లా ఆస్పత్రికి తర లించారు. పరిస్థితి ఆందోళన కరంగా ఉండడం తో వైద్యు ల సూచనల మేరకు బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రి కి తరలించారు. కాగా డ్రైవర్ అతి వేగంతోనే ప్రమాదం జరిగిందని కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసున మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు.

టీడీపీ గెలుపు.. అభివృద్ధికి మలుపు

● తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి



పీటీఎంలో విస్తృతంగా పర్యటిస్తున్న తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి

పెద్దతిప్పసముద్రం మార్చి 19 : తెలుగుదేశం పార్టీ గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన పీటీఎం మండలంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారంటీ, విజయ సంకల్ప ప్రచార యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక పీటీఎంలో పర్యటించి చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్థానిక బస్టాండులో ఉన్న శ్రీకృష్ణదేవరాయుల విగ్రహానికి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ నాయకులతో కలసి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రామాయణ సృష్టికర్త అయిన వాల్మీకీ మహర్షి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన మేనిపెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలపై స్థానిక పీటీఎంలోని పెద్దకాలువగడ్డ, రామాపురం వీధి, మసీదువీధి, సంతబజారు, బ్రాహ్మణవీధి, చింతకాయలవీధి, దేవళంపేట, బెస్తవీధి, గడ్డంవారివీధి పర్యటించి ఇంటింటా ప్రచారం చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీతోనే పేదలకు, రైతులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె జనసేన నియోజకవర్గ నేత పోతుల సాయినాథ్, మొలకలచెరువు మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఓబులేసు, సింగల్ విండో మాజీ ఛైర్మన్ సంపతికోట కిట్టన్న, బందార్ల వెంకట్రమణ, మాజీ ఎంపీటీసీ చిన్నా, మాజీ ఎంపీటీసీ సూరి, జనసేన పీటీఎం మండల అధ్యక్షుడు శంకర, ఎగవపల్లె రామచంద్ర, అంకిరెడ్డిపల్లె రమేష్‌రెడ్డి, పాలగిరి రామాంజులు, గ్రామకమిటీ అధ్యక్షుడు కత్తి ఆదినారాయణ, మస్తాన్, రాము, తదితరులు పాల్గొన్నారు.

పెద్దశేష వాహనంపై లక్ష్మీనరసింహుడు



గుర్రంకొండ, మార్చి 19:గుర్రంకొండ మండలం తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామి వారు తిరుచ్చి, పెద్దశేష వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయాన్నే స్వామి వారిని మేల్కొలిపి ఆలయశుద్ద, తోమాలసేవ, అర్చన, అభిషేకాలను వేదపండితులు నిర్వహించారు. అనంతరం తిరుచ్చి వాహనంపై స్వామి వారిని ఉంచి పూజలను చేసి గ్రామంలో ఊరేగించారు. అనంతరం స్నపన తిరుమంజన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంకాలం ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పెద్దశేష వాహనంపై గ్రామ పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి వారి వాహనం ముందు చెక్క భజనలు, కోలాటాలు, బాణసంచ పేల్చుతూ ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకోవడానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధికంగా వచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో వరలక్ష్మీ, గోపినాథ్, వెంకటస్వామి, కృష్ణమూర్తి, అర్చకులు గోపాల్‌భట్టార్, కృష్ణరాజ్, కృష్ణప్రసాద్, అనిల్, గోకుల్, వెంకీ, వరద, నరసింహా, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. తరిగొండ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో బుధవారం ఉదయం స్వామి వారు తిరుచ్చి వాహనంపై, సాయంత్రం గజ వాహనంపై ఊరేగనున్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం దృశ్యం

వాల్మీకిపురం, మార్చి 19: పట్టణంలోని పట్టాభిరామాలయంలో మంగళవారం టీటీడీ ఆధ్వర్యంలో పునర్వసు సీతారాముల కల్యాణోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. నూతన వధూవరులైన సీతారాములకు విశేష అలంకరణలు గావించి మంగళ వాయిద్యాలు, వేదపండితుల మంత్రో చ్చరణలు, విశేష భక్తజనం నడుమ కల్యాణం కమనీయంగా సాగింది. సాయంత్రం తిరుచ్చిలో సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాములను పురవీధులలో నగరోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఆధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు కృష్ణప్రసాద భట్టార్, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేత

మదనపల్లె అర్బన్, మార్చి 19: స్థానిక బెంగళూరు రోడ్డులోని ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు మదనపల్లె పట్టణానికి చెందిన ఎస్ఎస్ జ్యూవెలరీస్ అధినేత శశిధర్ కుటుంబసభ్యులు మంగళవారం ధాత్రి ఫౌండేషన్ ద్వారా 70మందికి విద్యాసామాగ్రిని అందజేశారు. కార్యక్రమంలో బీసీ హాస్టల్ వెల్ఫేర్ వెంకటేష్, ఎస్సీ హాస్టల్ వెల్ఫేర్ రాంప్రసాదు, నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం హరికృష్ణలు పాల్గొని పదవ తరగతి పరీక్షలు రాస్తున్న వారికి శుభాకాంక్షలు తెలిపారు.

తొలగించిన వైసీపీ జెండా

నిమ్మనపల్లి, మార్చి 19: ఎన్నికల కోడ్ అమలు ఉన్నప్పటికీ మండలంలోని వెంగంవారిపల్లి పంచాయతిలోని గ్రామ సచివాయలం ఎదుట ఏర్పాటు చేసిన వైసీపీ జెండాను అధికారులు తొలగించారు. మంగళవారం వెంగంవారిపల్లి సచివాలయం ఎదుట వున్న వైసీపీ జెండాతో పాటు పలు పార్టీలకు చెందిన గోడరాతలను చెరిపి వేసినట్లు పంచాయతి కార్యదర్శి వెంకటరమణ తెలిపారు.

చెట్లను నరకడం మానవాళి
మనుగడకే ప్రమాదం

మదనపల్లె అర్బన్, మార్చి 19: చెట్లను నరకడంతో మానవాళి మనుగడకే ప్రమాదమని అపెక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గొల్లపూడి తిరుపతి రావు అన్నారు. మంగళవారం పట్టణంలో రాత్రికి రాత్రే చెట్లు నరికేస్తున్నారని, కాలుష్యాన్ని కాపాడాలని సబ్ డివిజన్ ఫారెస్టు అధికారికి అపెక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా గొల్లపూడి తిరుపతిరావు మాట్లాడుతూ పట్టణంలో రానురాను జానాభా విపరీతంగా పెరుగుందని, వాహనాలు అధికంగా ఉండడంతో కాలుష్యం ఏర్పడుతోందన్నారు. పట్టణం, పరిసర ప్రాంతాల్లో చెట్లను నరకకుండా పార్రెస్టు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎస్‌ఏ కృష్ణమూర్తి, రెడ్డెప్పరెడ్డి, ఆడిటర్ రామచంద్ర, డాక్టర్ అప్పినిపల్లె భాస్కరాచారి పాల్గొన్నారు.

ఆదర్శ ఉద్యోగులకు నగదు అవార్డులు

మదనపల్లె అర్బన్, మార్చి 19: ఆర్టీసీ టూ డిపో పరిధిలో విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన ఆర్టీసీ ఉద్యోగులకు మంగళవారం ఆర్టీసీ గ్యారేజ్‌లో నగదు అవార్డులతోపాటు ప్రశంసాపత్రాలను టూ డిపో ఇన్‌చార్జీ మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంధనం పొదుపులో, ఎక్కువ కేఎంపీఎల్ సాధించిన ఆర్టీసీ ఉద్యోగులను ఆయన అభినందించారు. . ఆర్టీసీ బస్సును నడిపే సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడరాదన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు గీతా, సూపర్‌వైజర్లు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

పోషకాహారం అవసరం

బి. కొత్తకోట, మార్చి19: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేసే పోషకవిలువలు కలిగిన ఆహారంతో మాతా, శిశువుల ఆరోగ్యం పదిలంగా వుంటుందని బి. కొత్తకోట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ భాగ్యమ్మ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రాజెక్ట్ కార్యాలయంలో ఐసీడీఎస్ సిబ్బంది పోషన్ పక్వాడా కార్యక్రమం నిర్వహంచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎంపీడీవో నూర్జహాన్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

గిరిజన తాండాల్లో పోలీసుల కవాతు

పెద్దమండ్యం, మార్చి 19: మండలం గిరిజన తాండాల్లో మంగళవారం కేంద్ర బలగాలు కవాతు నిర్వహించారు. పెద్దమండ్యం ఎస్‌ఐ చెన్నకేశవ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించారు. ప్రస్తుతం జరుగునున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు జరుగునున్న నేపధ్యంలో శాంతి భద్రతలు దృష్టిలో ఉంచుకొని ముందస్తుగా గ్రామాలలో కవాతు నిర్వహించారు.

ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది

మదనపల్లె టౌన్, మార్చి 19: ప్రజాస్వామ్యానికి ఓటుహక్కు పునాదిలాంటిదని రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో హరిప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఆర్డీవో ఆధ్వర్యంలో ఓటుహక్కుపై స్థానిక సబ్‌కలెక్టరేట్ నుంచి పట్టణంలోని బీసెంట్ సర్కిల్ మీదుగా వెలుగు, డ్వాక్రా మహిళలు, అంగన్‌వాడీలతో ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటుహక్కు పొందాలన్నారు. బీసెంట్ సర్కిల్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగంపై ఎస్‌హెచ్‌జీ సభ్యులకు అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, ఎంపీడీవో భానుప్రసాద్, తహసీల్దార్ రమాదేవి, సీడీపీవో సుజాత, వన్‌టౌన్ సీఐ వల్లీబషు, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

కురబలకోటలో: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహశీల్దార్ ఈశ్వరమ్మ, ఎంపీడీవో హరినారాయణలు పేర్కొన్నారు. మండలంలోని కురబలకోటలో ఓటు హక్కును వినియోగించుకోవడంపై వెలుగు మహిళలు, అంగన్‌వాడీలు అవగాహన ర్యాలీ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటు కలిగిని వారు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పెద్దమండ్యంలో: ఓటు కలిగివున్న ప్రతి పౌరుడు ఓటు హక్కు వినియోగించుకోవాలని పెద్దమండ్యం ఎంపీడీవో వెంకటరమణయ్య పిలుపు నిచ్చారు. పెద్దమండ్యంలో మంగళవారం ఎంపీడీవో, అంగన్‌వాడీ, వెలుగు సంఘాలు కలసి ర్యాలీ నిర్వహించారు. సీనియర్ అసిస్టెంట్ నాగేంద్రబాబు, ఏపీఎం మధుశేఖర్‌బాబు, అంగన్‌వాడీ సూపర్‌వేజర్ కళావతమ్మ, మండల సమాఖ్య అధ్యక్షురాలు సరస్వతి, వెలుగు సంఘాల మహిళలు, సీసీలు తదతరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: సాధారణ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ విలువైన ఓటు హక్కు వినియోగించుకోవాలని తహసీల్దారు బ్రహ్మయ్య, ఎంపీడీవో కృష్ణమూర్తి కోరారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అంగన్వాడీ సిబ్బంది, వెలుగు, ఉపాధి హామీ సిబ్బందితో ఓటు వినియోగం పైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తంబళ్లపల్లె మూడు రోడ్ల కూడలిలో మానవహారం ఏర్పడి ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఏపీఎం గంగాధర్, ఏపీవో అంజినప్ప, ఐసీడీఎస్ సూపర్వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో: పీటీఎంలోని వెలుగు కార్యాలయంలో మంగళవారం మండల స్థాయి అధికారులు ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాసులు, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పీటీఎం బస్టాండులో అంగన్‌వాడీ వర్కర్లు, అధికారులు మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఐసీడిఎస్ అధికారులు, పోలీసు అధికారులు,అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

బి. కొత్తకోటలో: రాష్ట్రంలో త్వరలో జరగనున్న లోక్‌సభ, శాసనసభ ఎన్నికలలో ఓటుహక్కు వినియోగంపై మంగళవారం వెలుగు మండల సమాఖ్య కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మండల తహశీల్దార్ పుణ్యవతి, ఎంపీడీవో నూర్జహాన్, సీడీపీవో భాగ్యమ్మ, సూపర్‌వైజర్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

నిమ్మనపల్లిలో: యువత 18ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ బాలాజిరాజు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఉద్యోగులు ఎంపీడీవో కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శాలుట్ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రజలు ఓటు హక్కు వినియోగంపై చైతన్యం కలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో నారాయణ, ఏపీఎమ్ రజినికుమారి, వీఆర్‌వోలు నాగరాజ. తులసి పాల్గొన్నారు.

కలకడలో: గ్రామల్లోని ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో పరమేశ్వరరెడ్డి అంగన్వాడీ కార్యకర్తలు, సంఘమిత్రలకు సూచించారు . మంగళవారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటును అర్హులైన ప్రతి ఒక్కరూ విని యోగించుకోవాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమం లో సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ రామకృష్ణారెడ్డి, ఏపీఎం రమేష్ తదిత రులు పాల్గొన్నారు.

ములకలచెరువులో: ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలంటూ మంగళవారం అధికారులు, అంగన్వాడీ కార్యకర్తలు, వెలుగు సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి ఓటు ఉన్న ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని, పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ అనీల్‌కుమార్, ఎంపీడీవో పోలప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలపై అప్రమత్తంగా వుండాలి

కలికిరి, మార్చి 19: ఎన్నికల కోడ్ నియమావళిపై సచివాలయ ఉద్యోగులు అప్రమత్తంగా వుండాలని ఎంపీడీవో రామకృష్ణ సూచించారు. మంగళవారం మేడికుర్తి సచివాలయంలో ఉద్యోగులకు ఆయన ఎన్నికల కోడ్ నిబంధనల గురించి వివరించారు. ఎన్నికల సమ యంలో సచివాలయ ఉద్యోగులు తప్పని సరిగా అందుబాటులో ఉండాలన్నారు.

పోలీసు లాంఛనాలతో ఏఎస్ఐ అంత్యక్రియలు



పోలీసు లాంచనాలతో ఏఎస్ఐ రెడ్డప్పనాయక్ అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దమండ్యం, మార్చి 19: పెద్దమండ్యం మండలం ఎన్‌వోపల్లిలో మంగళవారం తంబళ్లపల్లి ఏఎస్ఐ రెడ్డప్పనాయక్ అంతక్రియలు పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. తంబళ్లపల్లి లో ఏఎస్ఐగా పని చేస్తూ పీటీఎం మండలం చంద్రాయునిపల్లి సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ఆదివారం రాత్రి విధుల్లో ఉన్న రెడ్డప్పనాయక్ మృతి చెందిన విషయం తెలిసిందే. స్వగ్రామమైన ఎన్‌వోపల్లి తాండ సమీపంలో మంగళవారం రెడ్డప్పనాయక్ అంత్యక్రియలు పోలీసు లాంచనాలతో తుపాకులతో మూడు రౌండ్లు గాలిలో కాల్పులు జరిపిన అనంతరం అంత్యక్రియలు పూర్తి చేశారు. కుటుంబసభ్యులు, బంధువులు, ఎస్‌ఐ చెన్నకేశవ, ఏఎస్ఐ మధుసూధనాచారి పోలీసులు, పాల్గొన్నారు. .

యువతను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం

ములకలచెరువు, మార్చి 19: యువతను ఆదుకోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేష్ పేర్కొన్నారు. ఏఐవైఎఫ్ మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ, వైసీపీ ప్రభుత్వాలు నిరుద్యోగులకు చేసిందేమీ లేదన్నారు. అనంతరం ఏఐవైఎఫ్ మండల కన్వీనర్‌గా కాలేషా ఎంపికయ్యారు. సీపీఐ మండల కార్యదర్శి అంజనప్ప, టౌన్ కార్యదర్శి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాగళం'తో ప్రభుత్వంపై ప్రజాగ్రహం వెల్లడైంది

● భద్రతా వైఫల్యాలపై విచారణ జరపాలి



పీలేరులో విలేఖరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పీలేరు, మార్చి 19: 'ప్రజాగళం' బహిరంగ సభ ద్వారా వైసీపీ అరాచక పాలనపై రాష్ట్ర ప్రజల్లో నెలకొన్న ఆగ్రహం బహిర్గతమైందని పీలేరు టీడీపీ నాయకులు పేర్కొన్నారు. పీలేరులోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం వారు విలేఖరులతో మాట్లాడారు. కూటమిలోని మూడు పార్టీల శ్రేణులతోపాటు లక్షలాది ప్రజలు స్వచ్ఛందంగా చిలుకలూరిపేట సభకు తరలి రావడం ద్వారా కూటమికి తమ సంఘీభావం తెలిపారన్నారు. అయితే స్వయంగా ప్రధాని పాల్గొంటున్న సభకు భద్రత కల్పించడంతో రాష్ట్ర అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. దురాలోచనతో కొంత మంది అధికారులు సభ నిర్వహణకు అడ్డంకులు సృష్టించడమే కాకుండా సరైన భద్రతా ఏర్పాట్లు చేయాలేదని దీనిపై సమగ్ర విచారణ జరపించాలని వారు డిమాండ్ చేశారు. ఎవరెన్ని కుట్రలు చేసినా వచ్చే ఎన్నికల్లో తమ కూటమి విజయం సాధించడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వారణాశి శ్రీకాంత్ రెడ్డి, మల్లెల రెడ్డిబాషా, పురం రామ్మూర్తి, పోలిశెట్టి సురేంద్ర, వసంతాల రాజా, శివారెడ్డి, షామియాన జయన్న, మహేశ్, వెంకట రమణ నాయక్ పాల్గొన్నారు.

టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తు సరైనదే..



పద్మభూషణ్ ముంతాజ్‌అలి ఆశీర్వాదం తీసుకుంటున్న టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాష

మదనపల్లె టౌన్, మార్చి 19: టీడీపీ, బీజేపీ, జనసేన కలసి ఎన్నికల్లో పోటీచేయడం సరైనదేనని సత్సంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, పద్మభూషణ్ ముంతాజ్ అలి పేర్కొన్నారు. మంగళవారం టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఎం.షాజహాన్‌బాషా పట్టణం, మండలంలోని పలు ప్రాంతాల్లో టీడీపీ నాయకులు, వైసీపీ సర్పంచ్‌లను మర్యాదపూర్వకంగా కలసి కూటమి అభ్యర్థి గెలుపునకు మద్దతివ్వాలని కోరారు. ఇందులో భాగంగా తొలుత సత్సంగ్ ఆశ్రమంలో యోగా గురు ముంతాజ్ అలిని కలసిన షాజహాన్‌బాషా ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం టీడీపీ నేత శ్రీరామనేని జయరామనాయుడును కలసిన షాజహాన్‌బాష టీడీపీ గెలుపునకు సహకరించాలని కోరారు. అనంతరం రెడ్డీస్‌కాలనిలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు భవాని ప్రసాద్, కురవంక సర్పంచ్ చిప్పిలి చలపతి, పొన్నేటిపాళెం ఉప సర్పంచ్ మల్‌రెడ్డిని, జేసీబీ మధుసూధన్‌రెడ్డి, సవరంవారిపల్లె ఈశ్వరనాయుడును కలసి వారి మద్దతు కోరారు. అనంతరం వలసపల్లె సర్పంచ్ సరస్వతమ్మ మృతి చెందిన విషయం తెలుసుకుని ఆమె అంత్యక్రియల్లో పాల్గొన్నారు. టీడీపీ ప్రొఫెషనల్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు పెరవలి నవీన్ ఆధ్వర్యంలో నరసింహ, నిరంజన్‌నాని, ఐటీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాటకొండ రాజేశ్, మర్రిపాటి రమేశ్, వంశీనరసింహ, సాయి తదితరులు షాజహాన్ బాషాను మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు.

పార్టీలో పనిచేసిన వారందరిని గుర్తు పెట్టుకుంటాం



మాట్లాడుతున్న టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి షాజహాన్‌బాష, శ్రీరామాంజనేయులు

మదనపల్లె, మార్చి 19: పార్టీలో పనిచేసిన ప్రతిఒక్కరినీ గుర్తు పెట్టుకుంటామని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఎం.షాజహాన్‌బాషా పేర్కొన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆపార్టీ నియోజకవర్గ నేత శ్రీరామ రామాంజనేయులు జనసైనికులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వారి ఆహ్వానం మేరకు షాజహాన్‌బాషా ముఖ్య అతిథిగా పాల్గొనగా, శ్రీరామ రామాంజనేయులు, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి దారం అనితలు..పార్టీశ్రేణులను పరిచయం చేశారు. నియోజకవర్గంలోని మదనపల్లె మున్సిపాలిటీ, మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాల పార్టీనేతలు, కార్యకర్తలు హాజరైన ఈ సమావేశంలో షాజహాన్‌బాషా మాట్లాడుతూ మనమంతా కలసి కట్టుగా పనిచేసి పార్టీని గెలిపిద్దామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో దారం హరిప్రసాద్, శ్రీరామ హరిహరన్, నాయని జగదీష్, చంద్రశేఖర్, శంకర్, సుప్రీంహర్ష, శ్రీనివాసులు, శంకర్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీగా చేరికలు



కిశోర్ సమక్షంలో టీడీపీలో చేరిన దొడ్డిపల్లె గ్రామస్థులు

పీలేరు, మార్చి 19: ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ పీలేరు మండలంలో టీడీపీలోకి చేరికలు భారీగా సాగుతున్నాయి. పీలేరు మండలంలో కీలకమైన అగ్రహారం, దొడ్డిపల్లె పంచాయతీల నుంచి వందల సంఖ్యలో వైసీపీ కార్యకర్తలు, సామాన్య ప్రజలు సోమవారం రాత్రి టీడీపీలో చేరారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు అభ్యర్థి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి వారందరికీ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఎవరికి ఏ కష్టమొచ్చినా తనను నేరుగా సంప్రదించవచ్చునని, ఏ సమయంలోనైనా అందుబాటులో ఉంటానని ఆయన వారికి స్పష్టం చేశారు. ఒకేరోజు రెండు కీలకమైన పంచాయతీల నుంచి ఒక్కసారిగా వందలాది మంది టీడీపీలోకి వెళ్లడంతో టీడీపీ నేతల్లో జోష్ పెరిగింది.

టీడీపీ డిక్లరేషన్‌తో బీసీలకు వరాల జల్లు



చెరువుముందరపల్లెలో ప్రచారం చేస్తున్న తనూజా రెడ్డి

కలికిరి, మార్చి 19: టీడీపీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌తో బీసీలందరికీ అనేక రకాల సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరనుందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కిశోర్‌కుమార్ రెడ్డి సతీమణి నల్లారి తనూజా రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆమె కలికిరి పంచాయతీలోని పలు గ్రామాల్లో సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీసీలకు చంద్రన్న బీమా రూ.10లకే లభిస్తుందని, పెళ్లి కానుక ద్వారా రూ.లక్ష లబ్ధి చేకూరుతుందని, 50 ఏళ్లకే రూ.4 వేల పెన్షన్ అందుతుందని వివరించారు. పంచాయతీలోని అశ్విరెడ్డిగారిపల్లె, అంకెంవారిపల్లె, చెరువుముందరపల్లె, కె.మాదిగపల్లె గ్రామాల్లో తనూజా రెడ్డి విస్తృతంగా పర్యటించారు. కార్యక్రమంలో కలికిరి సర్పంచు ప్రతాప్‌కుమార్ రెడ్డి, ఎంపీటీసీ గాయత్రి, మాజీ సర్పంచు నల్లారి లక్ష్మీకర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ నల్లారి చంద్రకుమార్ రెడ్డి, నిజాముద్దీన్, విశ్వనాథ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, కుమార్ రెడ్డి, చంద్రశేఖర్, వెంకటనారాయణ రెడ్డి, మునాఫ్, అక్బర్, రాంబాబు, సహదేవ రెడ్డి, కేవీ రెడ్డి, రాజా రెడ్డి, శ్రీమన్నారాయణ రెడ్డి, రమేష్ చెట్టి, అఫ్రోజ్, జ్ఞాన, ఏసుదాను, అగస్తి, వైజాగ్ బాషా, రెడ్డెప్ప రెడ్డి, మధు, జనార్ధన గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ గ్యారంటీలతో మహిళాభివృద్ధి

పీలేరు, మార్చి 19: మహిళల కోసం కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ ప్రకటించిన గ్యారంటీలతో దేశంలో మహిళాభివృద్ధి ఖాయమని జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రమణమ్మ తెలిపారు. పీలేరులో మంగళవారం ఆమె విలేఖరులతో మాట్లాడారు. ప్రతి కుటుంబంలోని మహిళకు ఏడాదికి రూ.లక్ష సాయం, ఉద్యోగాల్లో 50 శాతం రిజర్వేషన్, ప్రతి జిల్లాలో సావిత్రి బాయి పూలే హాస్టల్ సౌకర్యం, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు జీతాలు పెంచడం, ఇందిరమ్మ అభయ హస్తం ద్వారా ప్రతి పేద కుటుంబానికి ప్రతి నెలా రూ.5 వేల సాయం వంటి గ్యారంటీలు మహిళల జీవితాల్లో కొత్త వెలుగులు తెస్తాయని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఈ పథకాలన్నింటినీ విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మంగళవారం రాయచోటిలో జరిగిన సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తులసి రెడ్డి తమ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారన్నారు.

ఉద్యోగ నియామకాల మెరిట్ లిస్టు విడుదల చేయండి

మదనపల్లె టౌన్, మార్చి 19: మదనపల్లె మెడికల్ కాలేజి, జనరల్ ఆస్పత్రిలో ఇటీవల ఉద్యోగాల నియామకాల మెరిట్‌లిస్టు విడుదల చేయాలని కాంట్రాక్టు పద్దతిలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్, కౌన్సిలర్, అటెండర్లు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ జమునకు సమాచారహక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకోవడంతో పాటు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నోటిఫికేషన్ ప్రకారం ఉద్యోగాల నియామకం వివరాలను చిత్తూరు జిల్లా ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో అన్ని కేటగిరిల ఉద్యోగాలకు సంబంధించి ప్రొవిజన్ మెరిట్ లిస్టు పెట్టలేదన్నారు. పూర్తి మెరిట్ పాయింట్లు, అనుభవం వున్న తమలాంటి వారికి అన్యాయం జరుగుతోందన్నారు. అనర్హులైన వారికి ఉద్యోగాల నియామకాలను రద్దు చేసి అర్హులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ కిరణ్‌కుమార్, కౌన్సిలర్ దీప్తి, నరసింహులు, శివయ్య, రాజశేఖర్, ప్రభావతి, చంద్రశేఖర్‌లు పాల్గొన్నారు.